రహస్య సాగరం

సంపత్

"బుయ్"మని చప్పుడు చేస్తూ ఎగురుతోంది విమానం.

లోపల కూర్చొనున్న విశ్వనాథ్ బృందం దీర్ఘాలోచనల్లో మిళితమై వున్నారు.

విశ్వనాథ్ - బ్రిగేడియర్. నలభైనాలుగు సంవత్సరాలుంటాయతనికి. ధృఢమయిన శరీరం. ఆరుగురు బృందంగల ఈ ఆపరేషన్ కు కమాండర్ గా నియమింపబడిన వ్యక్తి.

అతని ప్రక్కగా సన్నగా ఉన్నట్టు కనిపించే వ్యక్తి మేజర్ ప్రకాష్. సీరియస్ గా, తనకేమీ పట్టనట్లుగా ఉంటా యతని చూపులు. అతని వయస్సు దాదాపు ముప్ఫయిఏడు. మంచి ఎక్స్ప్లోజివ్ ఎక్స్పర్ట్.

మిగిలిన వ్యక్తులు లెఫ్టినెంట్ కర్తార్ సింగ్, కెప్టెన్

డిసౌజా. మరో ఇద్దరు సహాయకులు, చంద్రకాంత్, కుమార్ సాహ్ని.

విమానంలో లైట్లు డిమ్‌గా వెలుగుతున్నాయి. వళ్ళో ఉన్న మాప్‌ని ఒకసారి చూసి, తాము దిగవలసిన ప్రదేశాన్నొకమారు గుర్తుపెట్టుకొని, జేబులోకి తోసేసాడు.

మరో అరగంట తర్వాత విమానంలో ఎర్రలైటు వెలిగింది. అందరూ లేచి నిలబడ్డారు. మానంగా పారచూట్స్ తగిలించుకోసాగారు. వీరుగాక విమానంలో మిగిలిపోయిన ఏడో వ్యక్తి వారు ధరించడంలోనూ, ఇతరత్రా సహాయపడసాగాడు.

విమానం పైలెట్ స్పీకర్‌లో తాము దిగవలసిన హిమాలయాల ప్రాంతాలు సమీపించినట్లు తెలియజేశాడు. అందరూ రెడీగా వున్నారు.

మరో పావుగంట అనంతరం, డోర్ దగ్గర ఎర్రలైటు ఆరిపోయి, పచ్చలైటు వెలిగింది. ఏడో వ్యక్తి డోర్ తెరిచి సంజ్ఞ చేయగానే బ్రిగేడియర్ విశ్వనాథ్ దూకేశాడు. అతని తర్వాత ప్రకాష్. వరుసగా దూకుతున్నారు. వారి తరువాత వారి సామానులుకూడా పారాచూట్ ద్వారా దిగుతున్నాయి.

మూడునిమిషాలనంతరం గాలిలో తేలుతున్నారందరూ. పారాచూట్‌లు విప్పుకుని నెమ్మదిగా దిగుతున్నాయి.

బ్రిగేడియర్ విశ్వనాథ్‌కి తెల్లగా కురుస్తున్న మంచు తప్ప మరేమీ కన్పించటంలేదు.

వారిని దింపటానికి వచ్చిన విమానం వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది. దట్టమయిన మంచులో దాని శబ్దం ఎక్కువ దూరం విన్పించలేదు.

నేలని సమీపించాడు విశ్వనాథ్. గాలి తాకిడి హెచ్చుగా వుంది. కాళ్ళు నేలకి తాకగానే వెనక్కి వాలిపోయాడు. ఒక్క నిమిషంలో పారాచూట్ ని విప్పు కున్నాడు. తెల్లటి పారాచూట్ ని కుప్పలా చేసి, మంచులో లోతయిన గొయ్యి తీసి, లోపల కప్పెట్టి మంచుతో పూడ్చాడు. వీపుమీద ఉన్న కిట్ ని సరిచేసుకుని నలు వైపులా చూశాడు.

కొంచెం దూరంలో అస్పష్టంగా ఆకారాలు కనిపిస్తు న్నాయి. మొట్టమొదటగా ప్రకాష్ కన్పించాడు. అప్ప టికే పారాచూట్ ని దాచేశాడు మంచులో.

పావుగంట అనంతరం కర్తార్ సింగ్ తప్ప మిగిలిన అయిదుగురూ కలుసుకున్నారు. సామానులతో సహా. మరో పావుగంట వెదికిన తర్వాత కర్తార్ సింగ్ శవం ఒకచోట కన్పించింది. అతను మంచులో సగం దూరుకపోయి వున్నాడు.

ప్రారంభంలోనే తమ సహచరుడు ఒకరు ప్రాణాలు కోల్పోవటం బాధ కల్గించింది అందరికి.

దిగిన ఇరవై నిమిషాలకు అందరూ అక్కణ్నించి కది లారు. విశ్వనాథ్ అందరినీ హెచ్చరించాడు, ఈపాటికి శత్రువులు రాడార్ ద్వారా తమ విమానాన్ని పసిగట్టినా, పసిగట్టవచ్చునని.

విశాలమయిన పర్వతం పైభాగంలో దిగారంతా. చదు నుగా ఉండటమేకాక, మిలిటరీ స్థావరానికి దగ్గరగా కూడా ఉండటంవల్ల దానిని ఎన్నుకున్నారు.

ఆ పర్వతం దాటితే అవతల మరో పర్వతం వుంది. మంచుతో నిండిన ఆ పర్వతాల మధ్య అక్కడక్కడ

చిన్న చిన్న చెట్లు, పొదలు వున్నాయి. వాటి మాటున నడుస్తూ మరో గంట అనంతరం అవతల పర్వతం ఎక్కారు.

ఆ పర్వతం మరికొంత దిగి, ఒక పొదచాటున కూర్చొని ముందుకు చూశారు పరిశీలనగా.

వారున్న పర్వత పాదంలో విశాలమయిన మైదానంలా వుంది. ఆ మైదానం చుట్టూ ఎత్తయిన మంచు పర్వతాలు మధ్యలో నిర్మితమవుతున్న చైనా మిలిటరీ "కాసిల్"కి పెట్టని కోటగా ఉంటున్నాయి.

బ్రిగేడియర్ విశ్వనాథ్ కి బైనాక్యులర్స్‌లో కన్పించిన దృశ్యం అద్భుతంగా ఉంది.

చుట్టూ కోటగోడవలె గట్టిగా నిర్మించబడి వుంది ఒక గోడ. కొండరాతితో నిర్మించబడిన ఆ రాతిగోడ చుట్టూ కందకం వుంది.

కోటకు ఇవతలివైపుగా, అంటే వారికెదురుగా సింహ ద్వారం కాబోలు వుంది. దానిదగ్గర కాపలా ఉధృతంగా వుంది. ప్రతివారిని చెక్ చేసిగాని లోనికి పోనివ్వటంలేదు. ఆ ద్వారం దాటితే కొండరాతితో వంతెన. వంతెన అవతల టౌన్ వుంది.

ఆ టౌన్ అవతల మరోకోట కన్పిస్తోంది. దానికీ, దీనికీ మధ్య పెద్ద అగాధం. రెంటినీ కలుపుతూ రోప్ వే ఉంది. దానిమీద కేబుల్ కార్స్ అటూ, ఇటూ తిరుగుతున్నాయి.

కోటను చేరుకోవటానికి ముందుగా, పర్వతం దిగువగా ఉన్న ఒక రైల్వే ట్రాక్‌ని చేరుకోవాలి. కోటకి నాలుగు న్నర ఫర్లాంగుల దూరంలో టిబెట్ వైపుగా ఉందొక మీటర్ గేజ్ రైల్వే ట్రాక్. ఆ ట్రాక్ యొక్కడితో

'ఎండ్'అయిపోతున్నది. ఆ ఎండ్ పాయింట్ దగ్గర చిన్న రైల్వే స్టేషన్‌వంటిది నిర్మించబడి ఉంది. అక్కడ అయిదారు వేగనులు తప్ప నామమాత్రపు కాపలాకూడా లేనట్లుగా వుంది.

బ్రిగేడియర్ విశ్వనాథ్ మరోసారి అంతా పరిశీలించి, ప్రకాష్‌కి ఇచ్చాడు బైనాక్యులర్‌ని.

అతని తరువాత నలుగురూ దానిని పరిశీలించారు. అందులోనే భారత మాజీ ఆర్మీ జనరల్ రత్నరాజన్‌ను చైనా వాళ్ళు నిర్బంధించినట్లు గూఢచారివర్గాలద్వారా తెలిసింది. ఇప్పుడు అతడిని విడిపించుకొని, వీలైతే ఆ చైనా రహస్య స్థావరాన్ని నాశనంచేసి రావడం విశ్వనాథ్ బృందం యొక్క ముఖ్య లక్ష్యం!

విశ్వనాథ్, తన అనుచరులవైపు తిరిగి తలి పంకించాడు 'ఓ. కె!' అన్నట్లు.

నిముషం అనంతరం అందరూ మెల్లిగా పర్వతం దిగ సాగారు.

2

లెంచూసుకున్నాడు బ్రిగేడియర్ విశ్వనాథ్. ఉదయం పదకొండు గంటలు దాటింది. ఆ సమయంలో మంచు ఉధృతంగా కురుస్తూన్నందువల్ల ఏది పగలో, ఏది రాత్రో తెలియటంలేదు.

సరిగ్గా పన్నెండు గంటలకల్లా హిమపర్వతం దిగి రైల్వే ట్రాక్ దాపుల్లోకి వచ్చేశారు.

కుమార్‌సాహ్నీ దగ్గరున్న వైర్‌లెస్ సెట్ ద్వారా తాము చైనా 'కాసిల్'ని కనుగొన్నట్లు, ట్రాక్ దగ్గరకు చేరుకున్నట్లు తెలిపి ఆఫ్ చేశాడు విశ్వనాథ్.

వారికెదురుగా రైల్వే ట్రాక్ సుమారు అరఫర్లాంగు దూరంలో వుంది. పర్వతం దిగువనున్న చెట్లమాటున నిలబడి వున్నారు విశ్వనాథ్ బృందం.

విశ్వనాథ్, ప్రకాష్‌వంక చూసి తల ఆడించాడు. ప్రకాష్ కూడా తల ఊపి నెమ్మదిగా లేచి తను దాగిన చెట్టునుంచి బయటికి వచ్చాడు.

ఓవర్ కోట్లు, గాగుల్స్, తలకు టోపీలతో వుండటంవల్ల ఎవరైనా చూసినా ఫలానా అని గుర్తుపట్టటం కష్టం.

అటూ ఇటూ చూశాడు ప్రకాష్. 'రైల్వే స్టేషన్' నుంచి అరమైలు దూరంలో ఉంటుంది కోట అటు వైపుగా. తాను వెళ్ళటానికి అంతకంటే మార్గం మరొకటి లేదు.

ఆ మీటర్ గేజ్ మీద ఇదివరకు కావలసిన వస్తువులు రవాణా చేసేవారు. అయితే యిప్పుడా ట్రాక్ వాడకంలో లేనట్లు కన్పిస్తోంది. ప్రతి రోజూ ఎవరో ట్రాక్‌ని శుభ్రపరుస్తున్నట్లున్నారు. లేకపోతే మంచు పేరుకొని మొత్తం ట్రాక్ కన్పించకుండాపోయేదే. కోట నిర్మాణం దాదాపు పూర్తయిపోవటంవల్ల ఆ ట్రాక్ అవశ్యకత తగ్గిపోయిందని భావించాడు బ్రిగేడియర్ విశ్వనాథ్. అంతే కాదు, ఆ హిమవత్పర్వతాల నడుమ రోడ్లు కూడా కన్పిస్తున్నాయి. ట్రాక్‌కంటే ఆ రోడ్డే దగ్గరిదారి కావచ్చు.

అడుగులో అడుగు వేసుకుంటూ నెమ్మదిగా నడుస్తున్నాడు ప్రకాష్. అతని చేతులు రెండూ కోటుజేబులో వున్న రివాల్వర్‌ని పట్టుకొనివున్నాయి. ఎవరూ అతన్ని గమనించినట్లు లేదు. అసలక్కడ ఎవరూ లేరు కూడా.

హోరుమని కురుస్తున్న గాలి, మంచుమధ్య నిశ్శబ్దంగా,

నిర్జీవంగా వుంది రైల్వే ట్రాక్, దాని ఎండ్‌లోనున్న రైల్వేస్టేషన్.

ఆ స్టేషన్ దాపుల్లో నాలుగు ఖాళీ వాగన్లున్నాయి, తలుపులు తెరిచే. వాటిల్లో ఎవరయినా వున్నారా...అని అనుమానించాడు ప్రకాష్. కాని అతన్ని ఎవరూ అడ్డగించలేదు.

దాదాపు స్టేషన్‌ని సమీపించాడు. అతన్నే గమనిస్తున్న మిగిలినవారు ఊపిరి బిగించి చూస్తున్నారు. వారి చేతులు రివాల్వర్ల మీదున్నాయి.

స్టేషన్ సమీపించి, అంతా ఒకసారి కలయచూశాడు ప్రకాష్. ఆ స్టేషన్ మొత్తంకలిపి అయిదారు గదులకంటె ఎక్కువలేదు. స్టేషన్‌ని ఉపయోగించి చాలాకాలం అయి ఉంటుంది. ఆ గదులనిండా బూజుపట్టిపోయివుంది. అక్కడక్కడ విరిగిపోయిన కుర్చీలు, టేబుల్లు ఉన్నాయి.

ట్రాక్ మీదున్న వాగన్ల క్రిందగుండా దాటి, అవతల ఉన్న మరో చిన్న యింటిని సమీపించాడు ప్రకాష్. స్టేషన్‌ను కాపలా కాస్తున్న సిబ్బంది అక్కడుంటున్నట్లుగా ఆధారాలు కనుపించాయి. అయితే మనుషులెవరూ కన్పించలేదు.

సరిగ్గా అరగంట అనంతరం వాగన్ల క్రిందగుండా ఇవతలికి వచ్చి చేయెత్తి సంజ్ఞచేశాడు ప్రకాష్.

అప్పటికి స్నోఫాల్ బాగా తగ్గిపోయింది. దూరంలోని వస్తువులుకూడా కన్పిస్తున్నాయి స్పష్టంగా.

ఒక్కొక్కరే బయటపడి ప్రకాష్‌వైపు అడుగు వేయసాగారు. చివరి వంతు విశ్వనాథ్‌ది. తనూ అటూ ఇటూ చూస్తూ ట్రాక్ వైపు అడుగు వేస్తున్నాడు.

ట్రాక్ ఇంకా కొద్దిదూరంలో ఉండగానే బ్రేక్ పడింది నడకకి. రైల్వే ట్రాక్ ఎగువనుంచి వస్తున్నారిద్దరు వ్యక్తులు. వాళ్ళిద్దరూ ఓవర్ కోట్లు ధరించివున్నారు. చేతిలో గన్స్ వున్నాయి.

బిగుసుకుపోయాడు బ్రిగేడియర్. వాళ్ళకి దయాదాక్షిణ్యాలుండవని, కన్పించినవాణ్ని కన్పించినట్లు కాల్చేయటానికి ఆర్డర్స్ ఉన్నాయని తెలుసు. తను వారి కంటపడ్డాడు. తప్పించుకోవటానికి అవకాశంలేదు.

వాగన్ కిందినుంచి చూస్తున్న ప్రకాష్, విశ్వనాథ్ ఆగిపోవటంతో అటూ, ఇటూ చూశాడు. వాళ్ళని చూడగానే గుండె క్షణం ఆగిపోయినట్లన్పించింది. మిగిలిన వాళ్ళు యింట్లో ఉన్నారు. తనచేతిలో ఏ ఆయుధమూ లేదు. ఏం చేయాలి?...ఆలోచిస్తున్నాడు ప్రకాష్.

ఏదో మాట్లాడుకుంటూ వస్తున్న ఆ యిద్దరు సెంట్రీలు, కొద్దిదూరంలో ఏదో ఆకారం కన్పించటంతో టక్కున ఆగిపోయారు. చేతులు ఆటోమేటిక్ గా గన్ని పొజిషన్లో పట్టుకున్నాయి.

ఆ ఆకారం ఏ చెట్టుదో, స్తంభానిదో కాదనీ, ఓ మనిషిదని గుర్తించేసరికి ఆశ్చర్యంతోపాటు అనుమానం కూడా పుట్టుకొచ్చింది.

ఈ సమయంలో ఎవరు ఇతను? ఎందుకిక్కడకొచ్చాడు? ఒకవేళ తామిక్కడ కాపలా కాస్తున్నామో లేదో చెక్ చేయడానికి వచ్చిన అధికారి కాదు గదా?

ఆ ఆలోచన రావటంతోనే ఇద్దరూ అదిరిపోయారు.

భయంభయంగానే అతనివైపు కదిలారు. గన్స్ వాలిపోయాయి క్రిందకు.

బ్రిగేడియర్ విశ్వనాథ్ జరగబోయేది క్షణంలో గ్రహించాడు. వాళ్ళిద్దరూ తనని గుర్తించలేదు. తానే ఏదో ట్రిక్ 'ప్లే' చెయ్యాలి.

కాస్త దూరం రాగానే ఆ ఇద్దర్నీ దగ్గరకు రమ్మన్నట్లు చేయూపాడు. బిక్కచచ్చిపోయిన ఆ ఇద్దరూ పరిగెత్తుకుంటూ వచ్చి అతని ఎదుట నిలబడ్డారు. ఎవరో అధికారి కాకపోతే అంత ధైర్యంగా తమని రమ్మని పిలుస్తాడా?

విశ్వనాథ్ ముందు అటెన్షన్‌లో నిలబడి ఏదో అంటున్నాడొక వ్యక్తి. ప్రకాష్ వెనకనుంచి పిల్లిలాగా వస్తున్నాడు.

ఎగిరి వారిమీద పడ్డారిద్దరూ. విశ్వనాథ్ చేతిలోని డాగర్ ఒకడి గుండెల్లోకి దిగింది మెత్తగా. రెండోవాడి గొంతు ప్రకాష్ చేతుల్లో నలిగిపోతూంది.

అరనిముషంలో ఆ ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఇద్దర్నీ ఎత్తి ఒక వాగన్‌లో పడేశారు.

ట్రాక్ దాటి, అవతలనున్న ఇంట్లోకి ప్రవేశించారు. కిటికీ చాటునుంచి చూస్తున్న సిబ్బందితో విషయం వివరించారు.

లోపలికి ప్రవేశించిన విశ్వనాథ్‌కి చాలా హాయి అన్పించింది. వెచ్చగా, హుషారుగా వుంది. హోరుమనే గాలిగాని, నిమిషంలో దట్టంగా పెరుగుకుపోయే మంచుగాని లేవు లోపల. అక్కడ చాలావరకు సామానుతో నిండివుంది. రిటైరింగ్ రూం కాస్తా స్టోర్ రూంగా మార్చినట్లు కన్పిస్తున్నది. విరిగిపోయిన కుర్చీలు, టేబుల్లు, బీరువాలు మొదలైనవి వున్నాయి ఇంటినిండా. అంతా ఒకటే రూం. మరో గది లేదు.

వైర్ లెస్‌లో విశ్వనాథ్ ఒకేఒక మాట మాట్లాడాడు. ''సక్సెస్.'' అంతకుమించి మాట్లాడితే ఇతరులు వినే ప్రమాదం వుంది. తరవాత చంద్రకాంత్ కాపలా కాయ టానికి సెంట్రీల దగ్గర్నుంచి లాక్కున్న గన్‌తో బయ టకు వెళ్ళిపోయాడు.

డిసౌజా స్టవ్ మీద బ్లాక్ కాఫీ తయారుచేసి ఇచ్చాడు. ఓవర్ కోటు విప్పి, జేబులోనుంచి మాప్ తీసుకొని, చిన్న కొవ్వొత్తి ముందు కూర్చున్నాడు విశ్వనాథ్.

3

రైల్వేస్టేషన్‌నుంచి కోటను చేరుకోవాలంటే ఒకే ఒక మార్గం వుంది. అదయినా 'రోడ్ వే' మాత్రమే. సుమారు ముప్పావుమైలు దూరంవరకు పర్వతపాదంలో వంకర్లు తిరుగుతూ ప్రయాణించాలి.

ఆ రోడ్‌కు కూడా అటూ ఇటూ చెట్లు, పుట్టలు వుండి, తాము కోటవరకు చేరుకుంటానికి తోడ్పడతాయని విశ్వ నాథ్ తెలుసుకున్నాడు. అయినా తాము ఆ రోడ్ మీదుగా ప్రయాణించటం ప్రమాదకరం. తమని ఎవ రయినా పరిశీలిస్తుండవచ్చు.

అన్నింటికంటే కష్టం అయినది మరొకటుంది. తమ గూఢచారి షీలాను కలవాలంటే ఆ 'టౌన్'లో వున్న 'బార్'కి పోవాలి. లోపల తమని గుర్తుపట్టటం ఖాయం. ఎలా?

ఈ ఆపరేషన్ బిగిన్ అయ్యే ముందే చెప్పారు అధి కారులు. 'కాసిల్'వద్ద విడవటంవరకే వారి పని. కోటలో ప్రవేశించి, జనరల్‌ని విడిపించుకురావటం అంతా తాము అప్పటికప్పుడు. ఆలోచించి, పరిస్థితుల . కనుగుణంగా నడుస్తూ చేయాలి.

ఇలా పరిపరివిధాలుగా ఆలోచిస్తున్న బ్రిగేడియర్ విశ్వనాథ్, తన ముందు మేజర్ ప్రకాష్ కూర్చోవటం కూడా గమనించలేదు.

ఇరవై నిముషాలనంతరం ఈ లోకంలోకి వచ్చాడు విశ్వనాథ్.

"తరువాత ప్లాన్ ఆలోచించారా?" అని అడిగాడు మేజర్ ప్రకాష్.

"అదే బోధపడటంలేదు. ఇక్కణ్ణుంచి చెక్‌పోస్ట్ వరకు చేరుకోవడం సులువే! కాని అక్కణ్ణుంచి లోనికెలా ప్రవేశించాలి? కోటచుట్టూ కందకం వుంది. సింహద్వారం తప్ప మరొకటి లేదు!"

ఆ సమయంలోనే కుమార్‌సాహ్నీ, డిసౌజాలు కలిసి ఒక వైర్‌లెస్ యంత్రాన్ని అక్కడికి తెచ్చారు.

"ఇక్కడి సెంట్రీలతో మాట్లాడటానికి కాబోలు. అదే నిజమయితే ఇక్కణ్ణుంచి వెంటనే తప్పుకోవాలి మనం. సెంట్రీలు రిపోర్ట్ పంపకపోతే వాళ్ళకి అనుమానం రావొచ్చు!" అన్నాడు చంద్రకాంత్.

అవునన్నట్లు తలాడించాడు బ్రిగేడియర్.

అదే సమయంలో వైర్‌లెస్ "బీప్, బీప్"మంది.

అందరూ ఊపిరి బిగించి దానివంకే చూస్తుండి పోయారు. టైం చూసుకున్నాడు ప్రకాష్. మధ్యాహ్నం ఒకటీ ముప్పైఅయిదు నిమిషాలు.

విశ్వనాథ్ దానిని ముట్టుకోలేదు. వైర్‌లెస్ ట్రాన్స్‌మిటర్‌లో మాట్లాడేటప్పుడు కోడ్ ఏదో చెప్పాలి. తమకు అది తెలియదు. తమ ఉనికి బయటపడినట్లే యిప్పుడు.

రెండు నిమిషాలు శబ్దం చేసి ఊరుకుంది అది.

అందరినీ బయలుదేరమని హెచ్చరించాడు బ్రిగేడియర్ విశ్వనాథ్. మరో అయిదు నిమిషాలనంతరం అందరూ తయారయ్యారు. తాము ధరించిన దుస్తులు విడిచి, చైనా అధికారుల యూనిఫాం తొడుక్కున్నారు. పైన ఓవర్ కోట్ వేసుకున్నారు. గాగుల్స్‌తో బయటికి నడిచారు.

అతి ముఖ్యమైన సామానులు మాత్రం ఒక సూట్ కేస్‌లో వుంచి, మిగిలిన వస్తువులనన్నింటినీ లోపలే బీరువాలలో దాచేశారు. మరికొన్ని బయటికి కన్పిస్తున్నట్లుంచారు. వైర్‌లెస్ సెట్ కూడా వుంది వాటిలో.

ఇప్పుడు వాళ్ళయిదుగురూ యూనిఫాంనిబట్టి చైనా మిలిటరీలో వివిధ రాంక్‌లకు చెందిన అధికారులు.

అందరూ బయటికి రాగానే తన కిట్‌లోనుంచి కొన్ని ఎక్స్‌ప్లోజివ్స్ తీశాడు మేజర్ ప్రకాష్. సిగరెట్లకంటే కొంచెం లావుగా వుండి, అదే సైజులో వున్నాయా బాంబులు. పదిపదిహేను కలిపి ఒక్కొక్క కట్టగా కట్టబడి వున్నాయి.

ఇల్లంతా కలయ చూసి ఒక చోటికి వచ్చాడు. ఒక మూల గోడ కెదురుగా ఇనుప బీరువా ఒకటి వుంది. దాని కెదురుగా నున్న గోడకు బట్టలు మొదలయినవి వుంచటానికి వీలుగా వెదురు బొంగులతో చేయబడిన చెక్కలున్నాయి. అడ్డంగా, స్టాండ్ మాదిరి.

ఆ స్టాండ్‌కి, బీరువా అడుగునా కొన్ని బాంబు కట్టలను టేప్‌తో అతికించాడు ప్రకాష్. తరువాత ఆ రెంటిని కంటికి కన్పించనంత సన్నని ఎలాస్టిక్ వైర్‌తో కనెక్ట్ చేశాడు. లాగిన స్ప్రింగ్ మాదిరి టెన్షన్‌లో ఉండా

వైర్. ఏమాత్రం వత్తిడి తగిలినా ఆ బాంబులు పేలుతాయి ఒక్కసారే.

మరో రెండు నిమిషాల తర్వాత అడ్డదోవలో ప్రయాణం సాగించారు అంతా.

ఫర్లాంగు దూరంకూడా నడవక ముందే ఎదురయ్యింది మిలటరీ ట్రక్కొకటి. వాళ్ళకి కనబడకుండా చెట్లచాటుకి తప్పుకున్నారు విశ్వనాథ్ బృందం. వాళ్ళు తమని దాట గానే వేగంగా నడక సాగించారు.

సెంట్రీల దగ్గర్నుంచి ఎటువంటి సమాధానం రాక పోవటంతో వైర్‌లెస్ ఆపరేటర్‌కి అనుమానం కలిగి, అధికారులకి తెలియచేయటం, వెంటనే పెట్రోలింగ్ ట్రక్స్ బయలుదేరడం జరిగింది.

రైల్వే ట్రాక్ దగ్గర ట్రక్ ఆగగానే బిలబిలమంటూ దిగారు సైనికులు. మొత్తం పదిహేను మంది వున్నారు. జట్లుజట్లుగా విడిపోయి, స్టేషన్‌ను చుట్టుముట్టారు. ఎంత గాలించినా ఎవరూ కన్పించలేదు, సెంట్రీల శవాలు తప్ప.

రిటైరింజ్ రూంలోకి ప్రవేశించారు. అక్కడ వాళ్ళు వదిలిన వస్తువులు చూడగానే ఎవరో వచ్చారని అర్థం అయ్యింది. ఒక్కొక్క వస్తువే బయట పడసాగింది.

ఒక సైనికుడు బీరువా దగ్గరకు నడుచుకుంటూ పోయాడు. బీరువా తెరిచేవుంది. లోపలంతా ఖాళీ. స్టాండ్ కూడా ఖాళీగా వుంది. మరో రెండంగుళాలు జరిగితే అతని కాలు వైర్‌కి తగిలేదే, కాని ఎవరో పిలవటంతో వెనక్కి తిరిగి వచ్చేశాడు.

అయిదు నిముషాలలో చెకింగ్ జరిగిపోయింది. మరో నిమిషం తర్వాత ట్రక్ వెనక్కి బయలుదేరింది.

ఆపాటికే విశ్వనాథ్ బృందం చెక్‌పోస్టుని చేరుకుంది. ఎవరూ తమను చూడటం లేదని గమనించి ప్రకాష్, విశ్వనాథ్ రోడ్ మీదకు నడిచారు. మిగిలిన వాళ్ళు రోడ్ ప్రక్కనున్న పొదల్లోనే వుండి, కొంచెం దూరంలోవున్న చెక్‌పోస్టుని గమనిస్తున్నారు.

ప్రకాష్, విశ్వనాథ్ యూనిఫాంకి కమాండర్ హోదా తెలిపే 'ఫ్లాగ్స్' వున్నాయి.

ఇద్దరూ నడుచుకుంటూ, మౌనంగా చెక్‌పోస్టుని సమీపిస్తున్నారు. వారిముందు పోతున్న ప్రతి ఒక్కరినీ పరీక్షించి, వారి ఐడెంటిటీ తనిఖీ చేసిగాని వదలటంలేదు గార్డులు.

వెనకనుంచి ఒక ట్రక్ వచ్చి అప్పుడే దాటింది. దాని కోసం ఎత్తిన ఇనుప కమ్మీని తిరిగి దించేశారు.

ఇద్దరూ దానిని సమీపించారు.

"అయితే...ఇండియా మీద దాడిచేయటానికి అంత కంటె అనువయిన ప్లాన్ లేదంటావ్?" చైనా భాషలో పెద్దగా అన్నాడు విశ్వనాథ్ ప్రకాష్‌తో.

వారి దగ్గరికి ఐడెంటిటీ కోసం రాబోయిన గార్డు వారి ఫ్లాగ్స్ చూసి, అటెన్షన్‌లో నిలబడి సెల్యూట్ చేశాడు. సాధారణంగా అంతపెద్ద హోదాగల వ్యక్తులు బయటకిరావటం అరుదు. అదృష్టవశాత్తు ఆ గార్డులు డ్యూటీలోకి వచ్చి అరగంటే అయింది.

అతని సెల్యూట్ అందుకున్నట్లు నటించి, కమ్మీని పైకిలేపమన్నట్లు చేయెత్తి ఏదో మాట్లాడుతున్నాడు విశ్వనాథ్, తలతిప్పకుండానే.

కమాండర్‌ని అడిగే ధైర్యం లేదతనికి. పైకి ఎత్తమన్నట్లు సైగచేశాడు.

రెండు నిమిషాలనంతరం ఇద్దరూ ఏదో మాట్లాడు కుంటూ లోపలికిపోవటం జరిగింది. గార్డు, వేగ్గా కరు రావ టంతో తన డ్యూటీలో పడిపోయాడు.

వంతెన దాటి టౌన్‌లోకి ప్రవేశించారు ఇద్దరూ.

"ఇంతవరకు సవ్యంగా జరిగింది. ఇక బార్ ఎక్కడో కనుక్కోవాలి. ఎవరినన్నా అడిగితే అనుమానిస్తారు" చిన్నగా అన్నాడు విశ్వనాథ్.

ఎదురుగా వస్తున్న కొంతమంది సైనికులు వీరిని చూసి తప్పుకుంటున్నారు.

"ఈ ఫ్లాగ్స్ వల్ల మనం మరింతగా వాళ్ళ దృష్టిలో పడుతున్నామేమో?" అన్న ప్రకాష్ సందేహానికి జవాబు యిచ్చాడు చిన్నగా విశ్వనాథ్.

"ఇంతకంటె గత్యంతరం లేదు. ఫ్లాగ్స్ తీయటానికి అనువయిన ప్రదేశం కన్పించటం లేదు."

టౌన్‌లో చెక్ చేస్తున్నట్టు అటూ ఇటూ తిరిగారు ఇద్దరు. తిరుగుతున్నంత సేపు తాము వారికి అనుమానా స్పదులమవుతామేమోమన్న శంక లేకపోలేదు.

చివరికి కన్పించింది బార్.

సైనికుల రిలాక్సేషన్ కొరకు ఏర్పరచిన బార్ అది. చిన్నసైజు నైట్‌క్లబ్ కూడా. డ్యూటీలో లేని సైనికులు అక్కడే ఉంటుంటారు దాదాపుగా. ఆఫీసర్స్ కోసం వేరే క్లబ్ ఒకటి ఉంది.

బార్ ముందు ఎవరూ లేరు. చటుక్కున తమ ఫ్లాగ్స్ తీసేసి, జేబులో వుంచుకున్నారు విశ్వనాథ్, ప్రకాష్‌లు. ఇప్పుడు వాళ్ళు తక్కువ రాంక్ ఆఫీసర్లు.

తలుపులు తోసుకుని లోనికి ప్రవేశించారు.

లోపల వాతావరణం వేడిగా వుంది. సిగరెట్ల పొగలు, వాసనలతో ఆ చిన్న హాలంతా దట్టంగా అల్లుకుపోయి వుంది. ఒక చివర వున్న స్టేజ్ మీద గిటార్ వాయిస్తున్నా రెవరో. ఒక యువతి అందంగా డాన్స్ చేస్తోంది.

"పైకి పొద్దంటున్నా వీళ్ళకీ పాశ్చాత్యాలమీద మోజుంది!" అనుకున్నాడు బ్రిగేడియర్ విశ్వనాథ్.

ఆనందంతో తాగుతూ, అల్లరిచేసే లోపలి వ్యక్తులకు లోపలి కెవరెవరు ప్రవేశిస్తున్నారో, వెళ్ళిపోతున్నారో అవసరం కాని, అవకాశం గాని లేదు. ఆ హాలులో లైట్లు కూడా వెలిగివున్నాయి.

బ్రిగేడియర్ విశ్వనాథ్, మేజర్ ప్రకాష్ ఇద్దరూ కళ్ళతోనే పలుకర్కుని కౌంటర్ దగ్గరికి పోయారు.

ఒక యువతి సర్వ్ చేస్తోంది అక్కడ. ఆమె షీలా. తాము బయలుదేరే ముందు ఫోటో చూసివుండటం వల్ల గుర్తించారు వెంటనే ఆమెను.

ఇరవైఅయిదేళ్ళ వయసుతో, బింకంగా, పొంకంగా వుందామె. చైనీస్ పోకలిలు కూడా కన్పించడంలో ఇండియన్‌కి చైనీస్‌కి పుట్టివుంటుందని అనుకున్నారు ఇద్దరు.

"వెడల్పాటి గ్లాస్‌లో బ్రాందీ!" అన్నాడు విశ్వనాథ్.

తలెత్తి చూసిందామె.

వాళ్ళని గుర్తుపట్టినట్లుంది. "ఎన్ని గ్లాసులు?" అంది.

"మీ యిష్టం. మేము ఇద్దరం!" అన్నాడు విశ్వనాథ్.

ఇద్దరికీ పోసి ఇచ్చిందామె. అక్కడే స్టూల్ మీద కూర్చున్నారిద్దరూ. ఆమెతో సరసాలాడుతున్నట్లు, డాన్సు చూస్తున్నట్లు నటిస్తూనే ఆమె వివరాలు తెలుసు కున్నాడు విశ్వనాథ్.

బ్రాంది పూర్తిగా తాగకముందే బయట బూట్ల చప్పుడు అయింది. మరుక్షణమే బిలబిలా పదిమంది సైనికులు లోనికి ప్రవేశించారు. వారందరి చేతుల్లోను తుపాకులున్నాయి.

హఠాత్తుగా మౌనం అయిపోయింది క్లబ్. చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దం. బూట్ల చప్పుడు తప్ప మరో శబ్దంలేదు.

ఆ పదిమందికి లీడర్ ఒక్కొక్కరినే ప్రశ్నిస్తూ వారి ఐడెంటిటీ పరీక్షిస్తున్నాడు.

తాము పట్టుబడినట్లేనని భావించారు ప్రకాష్, విశ్వనాథ్‌లు. ఐడెంటిటీ కార్డు తయారుచేయవచ్చు. కాని సంతకం ఫోర్జరీకూడా చేయటానికి వీలులేకుండా, ఆ సంతకం నమూనా తెలియలేదు.

ఈ సమయంలో పట్టుబడిన వారికి మరణదండన తప్ప మరొకటి లేదని తెలుసు. అందరినీ పరీక్షించి, విశ్వనాథ్, ప్రకాష్‌ల ముందుకొచ్చి ఆగాడు నాయకుడు.

4

బ్రిగేడియర్ విశ్వనాథ్, మేజర్ ప్రకాష్ నిరాటంకంగా లోనికి వెళ్ళటంతో ఊపిరి పీల్చుకున్నారు కెప్టెన్ డిసౌజా, చంద్రకాంత్, సాహ్నిలు. తిరిగి తామొచ్చే వరకు అక్కడే ఉండమని చెప్పాడు విశ్వనాథ్. బయటికి వచ్చే వ్యక్తులను మాత్రం ఎటువంటి చెకింగ్ లేకుండా వదులుతుండటం వలన వాళ్ళు బయటికి రావడం కష్టం గాదు.

అయితే కెప్టెన్ డిసౌజా మరో దృశ్యంచూసి అదిరి పోయాడు. వారికోసం వెళ్ళిన ట్రక్కు తిరిగి వస్తోంది.

దాని నెంబర్ బాగా గుర్తు డిసౌజాకి.

తమకోసం చెక్ చేస్తూ, స్టేషన్ అంతా గాలిస్తారని ఊహించి, బాంబులను అమర్చివచ్చారు తాము. కాని క్షేమంగా తిరిగివచ్చారంటే అర్థమేమిటి? బాంబులని చూశారా? లేక అదృష్టవశాత్తు తప్పించుకున్నారా?

విశ్వనాథ్, ప్రకాష్‌లు లోనికివెళ్ళి అరగంట దాటుతోంది. ఇంతవరకు అయిపు లేరు. ఇప్పుడేం చేసేటట్లు?

లోనికి వెళ్ళిన ట్రక్కు వంతెన దాటి, మలుపు తిరిగి మాయం అయిపోయింది.

కాని మరో ఇరవై నిముషాలనంతరం, టాప్ లేని జీప్ ఒకటి బయటికి రావడం వారు గమనించారు. ఆ జీప్‌లో నలుగురయిదుగురు సైనికులతోపాటు విశ్వనాథ్, ప్రకాష్‌లు కూడా ఉండటం చూసి నిర్ఘాంతపోయారు. శత్రువులంత త్వరగా పనిచేస్తారని ఊహించలేరు. లోపల చెకింగ్ ఎంత కట్టుదిట్టంగా ఉందో తెలుపుతుందీ సంఘటన.

మంచులో నిండిన రోడ్ మీదుగా, నున్నగా పోతున్న జీప్‌ని చూసి కెప్టెన్ డిసౌజా ఏదో ఆలోచించి, తన సహచరులకు లోగొంతుతో చెప్పాడేదో. నిమిషం తర్వాత ఆ ముగ్గురూ అడ్డంబడి, వెనక్కి మరలారు చెట్ల చాటున.

తమకు ఇరువైపులా సైనికులు కూర్చొని వాచ్ చేయడం వలన తప్పించుకునేందుకు మార్గాలు వెదుకుతున్నారు విశ్వనాథ్, ప్రకాష్‌లు.

తాము పట్టుబడిన వెంటనే చంపకుండా, ఇలా తీసుకుపోవడంలో ఏదో దురాలోచనే ఉందని గ్రహించాడు విశ్వనాథ్. ముందు సీట్లో కూర్చొని చుట్టుపక్క పరిస

రాలు పరిశీలిస్తున్నాడు అతను తాపీగా. వెనక సీట్లో వున్న ప్రకాష్ అంతకంటే తాపీగా కూర్చున్నాడు.

ఆ మంచులో, టాపులేని జీపులో పోతుండడంవల్ల చలిగాలి ఈడ్చికొడుతూంది. పైగా విశ్వనాథ్, ప్రకాష్‌ల ఓవర్‌కోట్లు వారు లాక్కున్నారు. వారి దుస్తులను ఎంత చెక్ చేసినా ఏమీ దొరకలేదు రివాల్వర్లు తప్ప.

తాము బయటికి రావడంతోనే డిసౌజా వెనక్కి వెళ్ళటం గమనించాడు విశ్వనాథ్. తమని రక్షించటానికి ఏదో ఒక ఉపాయం ఆలోచించకపోరు వాళ్ళు.

అడ్డదిడ్డంగా వున్న కొండదారుల వెంట పైకి పోతోంది జీప్.

మంచువల్ల స్లిప్ కాకుండా జాగ్రత్తగా డ్రైవ్ చేస్తున్నాడు డ్రైవర్. రోడ్‌కి ఒక వైపు పర్వతం, మరోవైపు లోతైన లోయ వుంది. లోయలోకి ఏమాత్రం స్లిప్ అయినా ఎముకలు కూడా కన్పించవు.

కోటనుంచి చాలా దూరం పోగానే రోడ్‌కి కొద్ది దూరంలో చదునుగానున్న ఒక ప్రదేశంలో వున్న ఒక శిథిలమైన ఇల్లు కన్పించింది. దాని ప్రక్కనే ఏదో షెడ్ కూడా వుంది. దాని తలుపులు మూసివున్నాయి.

బూట్ కాలితో ఏదో సైగచేశాడు విశ్వనాథ్, క్రింద తాటిస్తూ. ఇంజన్ హోరులో ఎవరూ వినలేదుగాని, విశ్వనాథ్‌నుంచి అటువంటి సిగ్నల్ ఏదో వస్తుందని ఎదురు చూస్తున్న ప్రకాష్ అది గ్రహించాడు. ఆ శబ్దంలో దాగి వున్న అర్థం అతడు గ్రహించాడు.

ఉన్నట్టుండి "స్టాప్!" అని అరిచాడొక సైనికుడు. సడన్ బ్రేక్‌తో ఆగిపోయింది జీపు. ఆ క్షణంలోనే సైనికుల చూపు కొంచెం దూరంలో రోడ్ మీద పడివున్న

ఒక వ్యక్తిమీదకు ప్రసరించాయి.

"ఎవరై ఉంటారు?" ఒకడన్నాడు చైనీస్ భాషలో.

"వీళ్ళవాళ్ళేమో?" మరొకడి సందేహం.

"దిగి చూస్తే పోలా!" అంటూ డ్రైవర్ క్రిందికి దిగాడు గన్‌తో. అతనివంక దృష్టి కేంద్రీకరించి ఉన్నారు మిగిలిన వాళ్ళు.

అంతకంటే మంచి అవకాశం ఎలా వస్తుంది విశ్వనాథ్ కి? వెంటనే విశ్వనాథ్ తనకిటువైపు కూర్చున్నతన్ని బలంగా బయటకు తోసేశాడు.

వెనకనున్న ప్రకాష్ తనకిటూ అటూ వున్న ఇద్దరి డొక్కల్లో పొడిచి, వాళ్ళు వంగగానే మెడమీద కిక్స్ యిచ్చాడు. అరవకుండా తలలు వాల్చేశారు వాళ్ళు.

బయటకు తోసినవాడిమీదకు ఎగిరి దూకాడు విశ్వనాథ్. ఆయన చేతిక్రింద వాడి కంఠం నలిగిపోయింది. నిమిషంలో ప్రాణాలు వదిలేశాడు.

ఇదంతా ముగించి వెనుదిరిగి చూసేసరికి ముందుకి వెళ్ళిన జీప్ డ్రైవర్ను లాక్కొస్తున్నారు చంద్రకాంత్, కుమార్ సాహ్నిలు.

కెప్టెన్ డిసౌజా వారి చేతుల్లోని గన్స్ లాక్కున్నాడు.

అదే సమయంలో దూరంగా ఏదో ట్రక్స్ వస్తున్న శబ్దం అయింది.

"వీళ్ళందర్నీ జీప్‌లో వేసి లోయలోకి తోసేయండి!" అన్నాడు విశ్వనాథ్. నిమిషం తర్వాత అయిదుగురూ కలిసి జీపుని లోయలోకి తోసేశారు.

డబడబడబమని శబ్దంచేస్తూ లోయలోకి దొర్లుకుంటూ పోతూందది. వెనకనున్న చెట్లచాటుకి తప్పుకున్నారంతా. ఆ క్షణంలోనే పెద్ద శబ్దం అయింది. పడిపోతున్న జీప్

పేలిపోయిన శబ్దం.

మూడు నిమిషాల తర్వాత ఆ ప్రదేశంలోకి ట్రక్ ఒకటి రావటం, క్రింద మండుతున్న జీప్ ని చూసి ఆగి పోవటం జరిగింది.

ఒకడు వైర్ లెస్ లో ఈ విషయం అధికారులకి తెలియ జేశాడు. మరో రెండు నిమిషాల తరువాత ట్రక్ వెనుకకు వెళ్ళిపోయింది.

వాళ్ళు వెళ్ళిపోగానే అన్నాడు ప్రకాష్. "మనం యిప్పుడు చనిపోయినవాళ్ళకింద జమ వాళ్ళ దృష్టిలో!"

"ఆల్ రైట్! ఇదీ మన మంచికే. ఇందువల్ల మనమీద అనుమానం తగ్గుతుంది. ముందు షీలాని కలుసుకోవాలి పదండి!" అన్నాడు విశ్వనాథ్.

5

వచ్చిన దిక్కుగానే నడవసాగారు రోడ్ వెంట.

"ఈసారి లోనికెలా వెళ్ళటం?" అడిగాడు చంద్ర కాంత్.

"ఈసారి ఆ సాహసం అవసరంలేదు. టౌన్ అంతా తిరగటంవల్ల బాగా గుర్తుంది. టౌన్ కి అవతల చివర షీలా ఉంటున్న భవనం ఉంది. ముందు అక్కడికి చేరుకోవాలి. అందుకు టౌన్ లోకి వెళ్ళాల్సిన అవసరంలేదు. ఈ పర్వతం దిగి చుట్టూ వెళితే సరిపోతుంది!" చెప్పాడు విశ్వనాథ్.

మరికొంత దూరం నడిచేసరికి శిథిలమైన ఇల్లు కన్పిం చింది. అందరూ ఆగి చూశారు.

అది పాతకాలంనాటి వర్క్ షాప్. లోపల చెడిపోయి శిథిలావస్థలోనున్న నాలుగు బస్సులున్నాయి.

వాటిని చూడగానే అవి తమ కుపయోగపడతాయని భావించాడు విశ్వనాథ్.

పరీక్ష చేసి చూడగా ఒకటి మాత్రం సరియైన కండి షన్‌లో ఉన్నట్లు తేలింది. దానికి చిన్న రిపేర్స్ చేస్తే సరిపోతుంది.

"వీటన్నిటిని ఇక్కడెందుకు వదిలేశారు?" అనుమానంగా ప్రశ్నించాడు కుమార్ సాహ్ని.

"తెలియదు! బహుశా ఏదైనా అవసరం వస్తే వాడ వచ్చని వాటినిలా వదిలేశారేమో?" అన్నాడు విశ్వనాథ్.

"అదంతా మనకెందుకు? మీరు దీని విషయం చూడండి. మేమిద్దరం వెళ్ళివొస్తాము. జాగ్రత్త. అను మానం రాకుండా చేయాలి!" అని ఏమేమి చేయాలో చెప్పాడు విశ్వనాథ్.

మరో పావుగంట తర్వాత కావల్సిన సామానులు ఒక కిట్‌లో సర్దుకుని బయలుదేరారు విశ్వనాథ్, ప్రకాష్‌లు.

ఆ పర్వతం చుట్టూ తిరిగి, కోట వెనుకభాగం చేరే సరికి రాత్రి ఎనిమిది గంటలయింది.

ఆ రాత్రి తనకు డ్యూటీ లేదని చెప్పింది షీలా. తామా రాత్రికి అక్కడకు వస్తామని చెప్పివున్నాడు విశ్వనాథ్.

అతనన్నట్లుగానే వారికోసం ఎదురుచూస్తోంది షీలా. సుమారు వంద గజాల ఎత్తులో, బలమైన పునాదితో, కొండరాళ్ళతో దృఢంగా నిర్మింపబడినదా కోట గోడ. ఆ గోడకి అక్కడక్కడా ఉబ్బెత్తుగా వచ్చినట్లు కట్ట బడిన బురుజులున్నాయి. ఆ బురుజుల ద్వారానే మెట్లుంటా యని, తామున్న భవనం కోటగోడకి ఆనుకునే ఉంటుం దని చెప్పింది షీలా.

బ్రిగేడియర్ విశ్వనాథ్ కిట్‌లోనుంచి పొడుగాటి, బలమైన తాడు తీశాడు. దానికొక చివర స్టీల్ కొక్కెం

ఉంది. దానిని బలంగా పైకి విసిరేశాడు.

పైనుంచి రెండో అంతస్థులో ఉంది షీలా గది. ఆ గదికి చువ్వలులేని కిటికీ ఉంది. ఒక మనిషి సులభంగా లోనికి పోవచ్చు దాని ద్వారా. ఆ కిటికీ కింద మరో మూడు కిటికీలు కన్పిస్తున్నాయి. వాటిల్లోంచి పల్చని కాంతి బయటకు ప్రసరిస్తోంది.

కిటికీలోనుంచి తొంగిచూస్తున్న షీలాకి మూడు, నాలుగు ప్రయత్నాలనంతరం అందింది తాడు. ఆమె దానిని పైనున్న దూలానికి కట్టి కిటికీ దగ్గరకు వచ్చి సైగ చేసింది.

విశ్వనాథ్ తాడుని లాగి చూసి, అనుభవజ్ఞుడైన మౌంటెనీర్ కుమల్లే గోడకి కాళ్ళు తన్నిపెడుతూ గబగబా పైకి పాకసాగాడు.

అతని తర్వాత ప్రకాష్ ఎక్కటం ప్రారంభించాడు.

6

"అమ్మయ్య! మిమ్మల్ని చూసేదాక మనస్సు మనస్సులో లేదు!" అంది షీలా విశ్వనాథ్ పైకి రాగానే.

"ఎందుకు?" అడిగాడు విశ్వనాథ్ కిటికీలోనుంచి తొంగిచూస్తూ.

"మీరు ప్రయాణిస్తున్న జీప్ ప్రమాదానికి గురయి అందరూ కాలి చచ్చిపోయారని తెలిసింది. అప్పట్నుంచి..."

"కావాలనే అలా చేశాము. ప్రస్తుతం మేము చచ్చిన వాళ్ళకింద జమ. కాబట్టి మా పనులు నిరాటంకంగా జరిగి పోతాయి. ముందు మాకు జనరల్ ఎక్కడున్నాడో, మేమేమి చేయాలో తెలియజేయి!"

"జనరల్ గురించి చాలా కొద్దిమందికే తెలుసు. నేనయినా ఓ ముఖ్యాధికారిని చాలా కాలంనుంచి వల్లో వేసుకుంటేగాని ఈమాత్రం అయినా తెలియలేదు.

ప్రస్తుతం జనరల్ అవతలి కాసిల్‌లో ఉన్నారని తెలుసు. కాని ఎక్కడుంటారో తెలియదు. దీనికీ, దానికి మధ్య రోడ్‌వే మాత్రమే ఉంది. అవతల కోటకి మరో దారి లేదు. ముఖ్యమైన అధికారులంతా అక్కడే ఉంటుంటారట. అక్కడికి చేరుకోవాలంటే మామూలు సైనికులకు అధికారం లేదు. కొందరు ముఖ్య అధికారులే అక్కడకు వెళ్ళివస్తుంటారు."

"మేమెలాగో చేరుకుంటానునుకో! మరి నీ సంగతి?... జనరల్ ఎక్కడున్నారో నీకూ, నాకూ తెలియదు గదా?" అన్నాడు ప్రకాష్.

"చెప్పాముగా, ఈ సారి ఒక ముఖ్యమయిన వ్యక్తి నే వలలో వేసుకున్నానని, కమాండర్ ఆయన. కేబుల్ కార్ ద్వారానే వెళతాను. మీ సంగతి, మీరక్కడికి ఎలా చేరుకుంటారో, జనరల్ ఎక్కడున్నాడో తెలుసుకోవడం మీ పని."

"అది సరే! నిన్ను కేబుల్ కార్ ద్వారా ఎలా పోనిస్తారు?"

"అది మామూలే! ప్రముఖ వ్యక్తులు తమకు నచ్చిన ఆడవాళ్ళతో అక్కడికి వెళ్ళటానికి కొద్దిగా నిబంధనలు సడలించారు. అయితే ఆ ఆడవాళ్ళ బాధ్యత అంతా అతనిదే. ఏమాత్రం బయటపడినా అతని ప్రాణాలుండవు."

విశ్వనాథ్ ఆలోచిస్తుండిపోయాడు. కొంచెంసేపు తరువాత ఎవరో తలుపు తట్టినట్లయింది. అందరూ ఊపిరి బిగించారు.

"నాకోసం ఎవరో వచ్చినట్లున్నారు. మీరు బాత్ రూంలోకి వెళ్ళండి!" అంది గుసగుసలాడుతున్నట్లుగా షీలా.

వాళ్ళని బాత్ రూంలోకి పంపి తలుపు తెరిచింది. గుమ్మంలో ఒక కమాండర్ నిలబడివున్నాడు. తలమీద ఉండవలసిన కాప్, చేతిలోవుంది. నలభై సంవత్సరాలుంటాయి. కొంచెం పొడుగు. అందమైన ముఖమే.

"హల్లో షీలా!" అన్నాడతను షీలాని చూడగానే.

"హల్లో కమాండర్!" అంది షీలా, తానూ నవ్వుతూ.

"నేనిప్పుడు కమాండర్ గా రాలేదు. ఒట్టి 'లీంపాగ్' గానే వచ్చాను. అన్నట్లు మనం బయలుదేరదామా?" అన్నాడు కమాండర్ లీపాంగ్.

"అక్కడికేనా?" మెరుస్తున్న కళ్ళతో అంది.

"అవును!" అన్నాడామె కంటిలోని కాంతిని చూసి ఆశ్చర్యపోతూ.

అటూ, ఇటూ చూసి, చటుక్కున అతని పెదాలపైన ముద్దు పెట్టుకుంది షీలా. తన్మయత్వంతో తల మునకలయ్యాడతను.

"థాంక్స్ కమాండర్! ఒక్క నిముషంలో రెడీ అవుతాను. మిమ్మల్ని కాస్త ఇబ్బంది పెడుతున్నాను" అంది.

"నోనో! నన్ను బయటే నిలబెట్టి మాట్లాడేస్తున్నావ్" అన్నాడతను.

"వద్దు. మీరు లోనికొస్తే కొంటె పనులు చేస్తారు. మనికి ఆలస్యం అవుతుంది. ఒక్క నిమషంలో వస్తాను. బైటిబైట కొంటెపనులు ఏమీ చెయ్యకండి!" అని నవ్వుతూ తలుపులు వేసింది షీలా.

గది మధ్యలో నిలబడి పైనున్న వస్త్రాలొక్కొక్కటే మార్చుకుంది. తలుపు తాళం సందులో నుంచి లీషాంగ్ చూస్తున్నాడని ఆమెను తెలుసు.

బాత్ రూంలోకి వచ్చిన షీలా లోగొంతుతో వాళ్ళకు ఏదో చెప్పింది. ప్రకాష్ కూడా తన కిట్ ని ఆమెకు యిచ్చాడు.

మరో ఐదు నిముషాలనంతరం లీషాంగ్, షీలా కలిసి వెళ్ళిపోయారు.

"మనం కేబుల్ కార్ స్టేషన్ చేరుకుంటేగాని, ఏ సంగతీ తెల్చుకోలేము!" అన్నాడు విశ్వనాథ్.

తాము కోటలోకి ప్రవేశించడానికి యిదివరకుపయోగించిన ట్రిక్ నే ప్రయోగించటానికి నిశ్చయించుకున్నారు.

ఫ్లాగ్స్ తీసి తగిలించుకుని, జేబుల్లో చేతులు పెట్టుకుని తాపీగా నడవసాగారు వరండాలో.

వంపు మెట్ల దగ్గర ఎదురయిన సిబ్బంది. వీరిని చూసి సెల్యూట్ చేశారు. దానికి తోడు విశ్వనాథ్ కూడా ఏదో కొంప మునిగినట్లు మాట్లాడుతూ, కంగారు నటించడంతో వారికి వీళ్ళని గమనించే అవకాశము లేకపోయింది.

ఎటువంటి అడ్డంకులూ లేకుండా క్రిందికి దిగారు. లోపల కొడ్డంతా పెంకుల మాదిరి రాళ్ళతో వేయబడి వుంది. నడుస్తుంటే బూట్ల చప్పుడవుతోంది.

మాప్ లో చూసినపుడు కేబుల్ కార్ స్టేషన్ ఎక్కడుందో బాగా గుర్తుంది. తమకు సంబంధించిన మాప్ లు, అవీ అన్నీ బూట్ల అడుగున రహస్య అరలో వుంచటం వల్ల, వాళ్ళని పట్టుకుని సోదా చెయ్యటంవలన ఏమీ బయట పడలేదు.

బయట రోడ్ మీద అక్కడక్కడ సెంట్రీలు తిరుగుతున్నారు. దూరంగా క్లబ్ లోనుంచి కేకలు విన్పిస్తున్నాయి. ఆ నగరం మూలమూలంతులు చీకటిలోనే వుంది.

7

ఒక భవనం క్రీనీడలో నిలబడి స్టేషన్ ను గమనించారు.

కేబుల్ కార్ స్టేషన్ బయట చెకింగ్ చాలా స్ట్రిక్ట్ గా వుంది. ప్రతి ఒక్కరినీ కమాండర్ అనిగాని, సైనికుడని గాని విచక్షణలేకుండా చెక్ చేసిగాని వదలటం లేదు.

నిముషం తర్వాత కూడబలుక్కొని కదిలారు విశ్వనాథ్ ప్రకాష్లు. అయిదు నిమిషాల తరువాత స్టేషన్ ప్రక్క నున్న ఒక భవనంలోకి వెళ్ళారు. లోపల దీపాలు లేక నిర్జనంగా వుందది. ఆ భవనం మీదకు నడిచి, భవనం వెనక్కు చేరుకున్నారు. భవనం అంచు లోయవైపు వుంది. కాలు జారితే అంతే! కిటికీలకు షేడింగ్స్ కట్టారు. వాటి మీదనుంచి సులభంగా దూకొచ్చు ప్రక్కదాని మీదకు.

వాటి మీదకు పోయి, నెమ్మదిగా నడుస్తూ స్టేషన్ దగ్గరకు చేరుకున్నారు.

కేబుల్ కార్ స్టేషన్ లోపల యంత్రాలన్నీ పని చేస్తున్నాయి. దబదబమన్న చప్పుడు విన్పిస్తోంది.

అగాధం వయిపు చూశారు. దూరంగా మిణుకు మిణుకు మంటున్న లైట్లు. కేబుల్ కార్ అది. వస్తున్నది.

అగాధం వైపు, స్టేషన్ పైన చెక్కతో చేసిన షేడింగ్ పైన కొంచెం చదరంగా వుంది. దానిపైన గ్లాస్ విండోస్ వున్నాయి.

ఏటవాలుగా వున్న షేడింగ్ సుమారు పది అడుగుల పొడవు, అయిదడుగుల వెడల్పుతో సరిగ్గా మధ్యకు చీలి

నట్లుంది. ఆ చీలిక గుండా కేబుల్ కార్ వచ్చే వైర్స్ పోతున్నాయి.

కేబుల్ కార్ ఒక స్టేషన్ నుండి బయలుదేరింది.

జేబులో నుండి వస్తువులు తీసి, వాటిల్లో తనకు కావలసిన ఉలిని తీసుకున్నారు యిద్దరు. దాని రెండో చివర కొక్కెంలా వుండి, మంచి పదునుగా వుంది.

భవనం కంటె, షెడింగ్ చాలా తక్కువ ఎత్తులో వుండటంవల్ల షెడింగ్ మీదకు దూకటం తప్ప మరో మార్గం లేదు.

కేబుల్ కార్ బాగా దగ్గర కొచ్చింది. యిప్పుడు దాని లోపలి వ్యక్తులు కూడా స్పష్టంగా కనిపిస్తున్నారు. సుమారు పదిమంది సులభంగా పట్టవచ్చు దానిలో. ఏడెనిమిది మంది వ్యక్తులున్నారు.

తాము వాళ్ళకి కన్పించే అవకాశము లేదు. తమమీద లైటు పడడం లేనందువల్ల అక్కణ్ణుంచి కదిలే ప్రయత్నం చేయలేదు ఇద్దరు.

కేబుల్ కార్ సమీపించింది. చటుక్కున షెడింగ్ మీదకి ఉరికాడు బ్రిగేడియర్ విశ్వనాథ్. ప్రాణాలతో పరిహాసంవంటిది ఆ ఫీట్. ఏ మాత్రం స్లిప్ అయినా అగాధంలోకే ప్రయాణం.

దూకిన క్షణంలోనే తన కుడిచేతిలోని ఉలిని అంత బలంగా షెడింగ్ చెక్కలోకి దిగేశాడు విశ్వనాథ్. జర్రున జారబోయిన అతను ఉలిని పట్టుకోవడంతో ఆగి, వేలాడసాగాడు. ప్రకాష్ కూడా షెడింగ్ మీదకు దిగాడు.

కేబుల్ కార్ సరిగ్గా షెడింగ్‌ని దాటగానే కేబుల్

కార్ పైన, ఇనుపతీగను చట్రం పట్టుకునే చోట, షెల్టర్ గా ఒక గట్టి ఇనుపరేకును దీర్ఘచతురస్రాకారంలో అమర్చారు. దానివల్ల మంచు లోపలికి పోయి యంత్రాలను పాడు చేయదు.

ఆ ఇనుపరేకు మీదకు విశ్వనాథ్, ప్రకాష్లు ఎగిరి దూకటం ఆ యంత్రం హోరులో ఎవరూ కనుక్కోలేదు.

ఆ చట్రం క్రింద మరో రెండడుగుల క్రిందగా వుంది. కేబుల్ కార్. దాని మీదకు దిగి సర్దుకు కూర్చున్నారు ప్రకాష్, విశ్వనాథ్ లు.

హోరుమని చప్పుడు చేసుకుంటూ, నిండు గర్భిణిలా ముందుకు సాగుతోంది కేబుల్ కార్. దాని లోపల లైట్ల కాంతిలో అందరూ నిలబడి వుండటం కన్పిస్తూంది కొద్దిగా వంగి చూస్తే.

ముందు అగాధం. కటిక చీకటి. కళ్ళుచించుకొని చూస్తున్నా ఏమీ కన్పించటం లేదు. దానికి తోడు ఈదురు గాలి భోరున కొడుతూంది. స్నో ఫాల్ కూడా మొదలయింది.

కేబుల్ కార్ లోపలి నుంచి చూస్తే, ఏ ఆధారం లేకుండా, ఆ చీకటిలో, శూన్యంలో ఎగిరిపోతున్నట్లుగా తమాషా అయిన అనుభూతి కలుగుతోంది షీలాకి.

క్రమంగా స్టేషన్ లోని లైట్లు దూరం అవుతున్నాయి. ఏమాత్రం కదలిక కూడా లేకుండాపోతూంది కేబుల్ కారు. లోపల అందరూ నిశ్శబ్దంగా వున్నారు. ఎవరూ మాట్లాడు కోవటం లేదు.

ఆ ఈదురు గాలి, మంచుపాతంలో పట్టుజారిపోకుండా గట్టిగా పట్టుకొని కూర్చున్నారు విశ్వనాథ్, ప్రకాష్లు.

దూరంగా కన్పిస్తున్న కోట లైట్లను బట్టి రెండింటి మధ్య ఎంత దూరం వుంటుందో అంచనా వేయటానికి ప్రయత్నిస్తున్నాడు విశ్వనాథ్. ఆ హోరులో తాము మాట్లాడుకుందామన్నా లాభం లేదు. పెద్దగా అరిస్తే గాని, ఎదుట వారికి విన్పించదు.

పది నిషాములనంతరం ఎదురుగా ఇంకొక కేబుల్ కార్ రావటం గ్రహించి ఇద్దరూ బోర్లాగపడిపోయారు, అది తమని దాటి పోయేంతవరకు.

సరిగ్గా ఇరవై నిముషాలు తరువాత అవతలి స్టేషన్ కు చేరుకుంది కేబుల్ కార్.

రెంటి నిర్మాణం ఒకేలా వుండటం వలన ఉలులతో రెడీగా షేడింగ్ మీదకు దూకటానికి ఉద్యుక్తులయ్యారు.

ఉలులు టక్కున గుచ్చుకోవటం, ఇద్దరూ షేడింగ్ పైకి ఎగబ్రాకటం, కేబుల్ కార్ లోనికి పోవటం జరిగింది.

అయిదునిమిషాల తర్వాత ఇద్దరూ పైకి చేరుకున్నారు. పైనున్న గ్లాస్ విండోస్ ద్వారా షీలా, లీషాంగ్ వెంట దిగటం కన్పించింది. లైట్ల వెలుగులో మసకగా కన్పిస్తున్న దానినిబట్టి ఆ కోటకి, ఈ కోటకి నిర్మాణంలో ఎటువంటి తేడా కన్పించలేదు.

"ముందు మనం షీలాని అనుసరించాలి. ఆమె ఎక్కడ దిగుతుందో తెలుసుకుంటే, మన పని సులభం అవుతుంది" అన్నాడు విశ్వనాథ్.

అలాగేనన్నట్లు తలవూపాడు ప్రకాష్.

ఇద్దరూ రిస్క్ తీసుకుని, ప్రక్కనున్న గోడమీదికి దూకారు. అదృష్టవశాత్తు అది అందింది. రెండునిమిషాల తరువాత పైకి చేరుకున్నారు.

అక్కడక్కడ స్ట్రీట్ లైట్సున్నాయి. కొంత దూరంలో లీంపాంగ్, షీలాలు వెళుతూ కన్పించారు.

ఎవరూ తమని గమనించటంలేదని తెలుసుకొని, నిశ్శబ్దంగా క్రిందికి జారారు.

చాలాదూరం నడిచి ఒక భవనంలోకి వెళ్ళారు షీలా, ఆమె ప్రియుడు లీపాంగ్.

"ఇప్పుడెలా?" అన్నాడు ప్రకాష్. మరికొంత సేపటికి భవనం పై అంతస్తులలో ఒకదానిలో లైటు వెల్గింది.

"బహుశా వీళ్ళే అయిఉంటారు. నాలుగో అంతస్తు అది." ఉత్సాహంగా అన్నాడు బ్రిగేడియర్ విశ్వనాథ్.

లీపాంగ్ బయటికి వస్తాడేమోనని ఒక పావుగంట వెయిట్ చేశారు గాని, ఫలితం లేకపోయింది.

ప్రకాష్‌వంక చూశాడు విశ్వనాథ్.

"ఈ భవనం వెనుక ఏదో ఖాళీస్థలం ఉన్నట్లుంది." అన్నాడు ప్రకాష్.

అతనిభావం గ్రహించాడు విశ్వనాథ్. "కాని మన దగ్గర తాడులేదుగా?"

"ముందు చూసి వద్దాం పద!"

ఇద్దరూ వెనక్కి చేరుకున్నారు. వెనక కొంచెం ఖాళీ స్థలం వుంది. దానితర్వాత మరో పర్వతం వుంది. భవనంపై అంతస్తులోని లైటు, కిటికీగుండా కన్పిస్తోంది. పైకి ఎలా చేరాలా అని ఆలోచిస్తున్నంతలోనే పైగదిలోని లైటు ఆరిపోయింది.

చీకట్లో ఒంటరిగా నిలబడిపోయారు ఇద్దరు.

8

సుమారు అరగంట గడిచింది. ఈ అరగంటసేపు ఏం చేయాలో తోచలేదు విశ్వనాథ్, ప్రకాష్‌లకు. భవనం

ముందునుంచి పోదామంటే చెక్ చేస్తున్నారు. బహుశా యివి గెస్ట్ రూమ్స్ కాబోలనుకున్నాడు విశ్వనాథ్.

పైనుంచి ఏదో తాడు క్రిందికి జారటంతో ఉలిక్కి పడ్డారు ఇద్దరూ. తలెత్తి చూశారు.

కిటికీలోనుంచి వంగి, ఎవరో చేతులూపుతున్నారు. మిగతా కిటికీలు మూసి ఉండటంతో చకచక పైకి చేరుకున్నారు.

ఆ గదిలో షీలా ఒక్కతే వుంది. ఎలక్ట్రిక్ దీపం లేదు. చిన్న కొవ్వొత్తి వెలిగించి వుంది.

వాళ్ళు పైకి రాగానే తాడు పైకిలాగి, తలుపు మూసింది.

"థాంక్స్! మా రాక ఎలా కనిపెట్టావ్?" అన్నాడు విశ్వనాథ్ సిగరెట్ ముట్టించుకుంటూ.

"లీషాంగ్ వదిలి వెళ్ళి, మరో గంటలో తిరిగొస్తానన్నాడు. మీ సంగతి గుర్తుకొచ్చింది. ఈపాటికి ఇక్కడికి చేరుకున్నా ఆశ్చర్యం లేదనుకుంటూ ముందువైపు చూశాను. ఎవరూ కన్పించకపోవటంతో వెనకవైపు వచ్చాను. చీకట్లో మీ ఆకారాలు అస్పష్టంగా కన్పించాయి. అంతే!"

"మేము కాబట్టి సరిపోయింది. అక్కడున్నది వాళ్లే అయితే...?"

"ఈపాటికి పరలోకంలో ఉండేవాళ్ళు!" అంది షీలా.

చిన్నగా నవ్వారు ఇద్దరూ.

"ఇక్కడికి ఎలా వచ్చావ్? ఏ మిష...ఏ నెపం మీద?" అడిగాడు ప్రకాష్.

"మా తమ్ముడిక్కడే వైర్‌లెస్ రూంలో పని చేస్తు

న్నాడని, చూసి చాలాకాలం అయిందని చెప్పాను లీషాంగ్ తో. నా మాటలు నమ్మాడు లీషాంగ్."

"అతను నీ గురించి ఎంక్వయిరీ చేస్తే?"

"అంతవరకు మీరూరుకుంటారా? వెంటనే బయలు దేరండి" అంది షీలా.

నిజానికి ప్రకాష్, విశ్వనాథ్ విపరీతంగా అలసి పోయారు. ఉదయం విమానం దిగిన దగ్గరనుంచి క్షణం కూడా తీరిక లేకుండా ముందుకు సాగుతున్నారు. అయినా వాళ్ళకిది అలవాటు కావడంవల్ల పెద్దగా బాధలేదు.

"లీషాంగ్ ఎక్కడికి వెళ్ళాడో తెలుసా?"

"తెలియదు. అప్పుడప్పుడు చాలామంది, ఆడవాళ్ళని ఈ రూమ్స్ లోకి తెచ్చుకుంటారు రహస్యంగా. ఈ రూమ్ల బయట గట్టి కాపలా వుంటుంది."

"ఈ విషయం అధికారులకి తెలిస్తే?"

"వాళ్ళకి ఎందుకు తెలియదూ? ఇది ఓపెన్ సీక్రెట్." అంది షీలా నవ్వుతూ.

"అయినా రూల్స్...రూల్స్ మరి." అంది మరలా.

ఏదో ఆలోచిస్తుండిపోయాడు బ్రిగేడియర్.

"ఇంతకు జనరల్ ని తెచ్చిన తరువాత యిక్కణ్నుంచి బయటపడే మార్గం ఆలోచించారా?" అంది.

అవునని జవాబిచ్చాడు ప్రకాష్. "టిబెట్ కు వెళ్ళే దారిలో సుమారు మూడు మైళ్ళ దూరంలో చైనీస్ విమాన స్థావరం ఒకటి వుంది. అక్కడ యుద్ధవిమానాలు, చిన్న విమానాలు దిగటానికి అనువుగా రన్-వే నిర్మించు కున్నారు వాళ్ళు. అక్కడ వాళ్ళ విమానాలు కూడా ఎల్లప్పుడూ రెడీగా వుంటాయని తెలిసింది. మన ప్రభుత్వా

నికి చెందిన విమానం ఒకటి సరిగ్గా రేపు ఉదయం ఆరు గంటలకు అక్కడకు వస్తుంది. ఈ లోపు మనం జనరల్‌ని రెస్క్యూచేసి తీసుకుపోవాలి" వివరించాడు ప్రకాష్.

"అయితే టైం లేదు. త్వరపడండి!" అంది షీలా.

"మా ఎక్స్‌ప్లోజివ్స్ అవీ..."

"తెచ్చాను!" అని ఎయిర్‌బాగ్ అడుగునగల ఒక రహస్య అరలోనుంచి చిన్న సంచి తీసి యిచ్చింది.

"దాన్ని చెక్ చేశారు. ఏమీ బయటపడలేదు! అఫ్‌కోర్స్...కమాండర్‌ని చూసి వదిలేసుంటారు నన్ను!"

అదే సమయంలో బయట వరండాలో బూట్ల చప్పుడయింది. "లీషాంగ్ రావచ్చు!" అని కిటికీలోనుంచి తాడుని క్రిందకి జారవిడిచింది. ఇద్దరూ క్రిందికి జారారు. అయితే క్రిందకి పూర్తిగా జారలేదు. మధ్యలో ఒక కిటికీ తెరిచి వుంది. సెంట్రీ ఎవడో చూస్తున్నాడు తొంగి. వాడి ముఖం బద్దలయింది విశ్వనాథ్ బూటు కాలి దెబ్బలో.

ఇద్దరూ ఆ కిటికీలోకే జారుకున్నారు. వాళ్ళు వెళ్ళిపోవటం చూసి, తాడు గబగబ పైకి లాగి ఒక మూల దాచింది షీలా. టక్కున లైటు వెల్గించి, తలుపు తీసింది.

మూడు నిమిషాలనుంచి తలుపు బాదుతున్న కమాండర్ లీషాంగ్ ముఖం నిద్రమత్తులో, పల్చటి గౌన్‌లోనున్న షీలాని చూడగానే ప్రసన్నమైంది. అప్పుడే నిద్రలోనుంచి లేచివచ్చినట్లుంది ఆమె ముఖం.

"బ్రహ్మాండమైన నిద్రపట్టింది" సంజాయిషీ చెప్తూ ఉంది షీలా, దారి తొలుగుతూ. లీషాంగ్ లోనికి వచ్చాడు. అయితే అతని ముక్కుపుటాలకు ఏదో వాసన తగిలింది.

సిగరెట్ల వాసన అది. పీకలు కూడా కన్పించాయి.

"నువ్వు సిగరెట్లు కూడా తాగుతావా?" అని అడగటంతో తెల్లబోయింది షీలా.

అంతకుముందు విశ్వనాథ్, ప్రకాష్‌లు సిగరెట్లు కాల్చి అక్కడే పీకలు పారేశారు. ఆ వాసనని పసిగట్టినట్లున్నాడు లీషాంగ్.

"ఎందుకు కాల్చను?" నవ్వుతూ అంది షీలా.

లీషాంగ్ మాట్లాడలేదు. సిగరెట్టు యిప్పుడే ఆర్పేసినట్లుంది. షీలా తాను నిద్రపోతున్నానని చెప్పింది. నిద్రపోతూ కాలుస్తుందా? ఎవరో వచ్చివుంటారు. షీలా ఏదో దాస్తుంది.

తన అనుమానం బయటపెట్టలేదు లీషాంగ్.

"నీ తమ్ముణ్ణి గురించి వాకబుచేశాను. ఆ పేరు గల వ్యక్తి వైర్‌లెస్ రూంలో ఉన్నాడట. ఇప్పుడే వెళ్ళి చూసొద్దాం. ప్రస్తుతం కమాండర్-ఇన్-చీఫ్, మిలిటరీ హెడ్స్ అంతా ఏదో సమావేశంలో ఉన్నారు కమాండర్-ఇన్-చీఫ్ ఇంట్లో. వాళ్ళకి తెలియకుండా మనం వెళ్ళి తిరిగిరావాలి. బయలుదేరు" అన్నాడు లీషాంగ్.

తాను ఇంకొక అధికారి ద్వారా వైర్‌లెస్ రూంలో పనిచేసే ఒకడి పేరు వినివుంది. అదే లీషాంగ్‌తో చెప్పింది. అతను, ఆ వ్యక్తిని కలుసుకొని తన గురించి ఇన్‌ఫాం చేయనందుకు సంతోషించింది షీలా.

"మరి మీరు పోలేదే ఆ సమావేశానికి?" అంది.

"నాకక్కడ పనిలేదు. టాప్ సీక్రెట్ సమావేశం అది. అయిదారుగురుకంటె ఎక్కువ లేరు."

జనరల్‌ని గురించి అడుగుదామా, వద్దా అని సంది

గ్ధంలోపడి, చివరకు ఒద్దనే నిర్ణయించుకుంది షీలా.

"జస్ట్ మినిట్. బాత్ రూంకి వెళ్ళివస్తాను!" అని చెప్పి అటాచ్ జేయబడిన రూంలోకి దూరింది.

ఆమె లోనికి వెళ్ళగానే గదంతా కలయజూశాడు. కిటికీ దగ్గర మంచుముద్రలున్నాయి యింకా.

లీషాంగ్ తిరిగి వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

అయిదు నిమిషాల తరువాత తిరిగి వచ్చింది షీలా. డ్రస్ ఛేంజ్ చేసుకొని ఇద్దరూ బయలుదేరారు.

వైర్ బాగ్ లో తన తమ్ముడికోసం తెచ్చిన పళ్ళున్నాయి. దానిని తీసుకొని వెంట నడిచించి షీలా.

ఇదివరకు ఆమె నివాసంలాగే ఉందా భవనం కూడా. భవనం మధ్యలో గుండ్రంగా క్రిందకి దిగుతూ పోయే మెట్లున్నాయి.

ఒక తలుపు చాటున ఎవరో కన్పించి, తమని పరీక్షగా చూడటంతో లీషాంగ్ చూడకుండా చేతిలోని కాగితాన్ని క్రిందకు జారవిడిచింది.

తలుపు సందుగుండా చూస్తున్న ప్రకాష్ వాళ్ళిద్దరూ వెళ్ళిపోగానే అటూ ఇటూ చూసి, చప్పున ఆ కాగితాన్ని లాక్కున్నాడు.

లోపల కాళ్ళుచేతులు కట్టివేయబడి, నోట్లో గుడ్డలు కుక్కబడి ఉందొక యువతి. ఆమె ప్రక్కనే క్రిందపడి ఉన్నాడో సైనికుడు.

ఆ కాగితాన్ని చదువుకుని, రెండు క్షణాల తరవాత బయటపడ్డారు బ్రిగేడియర్ విశ్వనాథ్, మేజర్ ప్రకాష్.

తన మామూలు ట్రిక్ నే ప్లే చెయ్యడానికి నిశ్చయించుకున్నాడు విశ్వనాథ్. యిద్దరూ క్రిందికి దిగుతున్నారు.

దాదాపు మెట్ల చివరకు వచ్చేశారు. అక్కడ మెట్లకు తలుపులున్నాయి.

అక్కడ కాపలా వున్న సెంట్రీలు వీరిద్దరినీ, వాళ్ళ ఫ్లాగ్స్‌ని వెలుతుర్లో చూసి సెల్యూట్ చేశారు. కాని వాళ్ళ ఐడెంటిటీ అడిగారు.

"నాన్సెన్స్! నేనెవర్ననుకుంటున్నావ్?" అన్నాడు కోపంగా విశ్వనాథ్.

"సారీ కమాండర్! కమాండర్ లీషాంగ్ మమ్మల్ని హెచ్చరించి వెళ్ళారు," అన్నాడు.

అంతా అర్థం అయిపోయింది యిద్దరికీ. లీషాంగ్ తమని పసిగట్టాడు. "ఆల్ రైట్! ఇదిగో!" అంటూ ప్రకాష్ వంక చూస్తూ, జేబులో చేయి పెట్టాడు విశ్వనాథ్.

మరుక్షణం యిద్దరి చేతుల్లోని రివాల్వర్లు వారిని బలి గొన్నాయి. చటుక్కున తలుపులు మూసి గడియవేశాడు విశ్వనాథ్.

"ఆ శబ్దం నిని అందరూ వొస్తారు. రెడీ ఫర్ ఏక్షన్!" అరిచాడు విశ్వనాథ్. అప్పటికే ప్రకాష్ బాంబ్స్ తీసి అక్కడక్కడ అతికిస్తూ, ఎలాస్టిక్ వైర్‌తో కనెక్ట్ చేస్తున్నాడు. క్రింద తలుపు బద్దలుకొట్టటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇద్దరూ ఒక్క ఊపులో షీలా గదిలోకి వచ్చిపడ్డారు. తాడుని కట్టి గబగబా క్రిందకు జారారు.

ఆపాటికే తలుపులు బద్దలుకొట్టుకుని, పైకి వచ్చిన సైనికుల కాళ్ళకు వైర్ తగలటం బాంబులు పేలటం మొదలయ్యింది. ఆ శబ్దానికి భయపడి పైనుంటున్న మరి కొంత మంది క్రిందికి పరుగెత్తారు.

భయంకరమయిన శబ్దాలతో ప్రళయం ప్రారంభం అయింది. ఆ సంచలనం గమనించి కాపలావున్న సైన్యం అక్కడ కమ్ముకోసాగింది.

ఆపాటికే తప్పించుకొని లోనికి చొరబడిన విశ్వనాథ్, ప్రకాష్‌లను గమనించే వారే లేకపోయారు.

ఎదురుపడిన యిద్దరు సెక్యూరిటి సిబ్బందిని మట్టి కరిపించి, వారి చేతుల్లోని మెషిన్ గన్స్ లాక్కున్నారు యిద్దరూ.

ఆ కోట మొత్తం బాగా గుర్తుంది యిద్దరికీ. ఇద్దరూ కమాండర్-యిన్-ఛీఫ్ నివాస భవనం వయిపు పరుగెత్తసాగారు.

దార్లో ఎదురవుతున్న సిబ్బందిని హెచ్చరిస్తూ, తాము ముందుకుపోతున్నారు. సైన్యం అంతా భవనంలోను ప్రేలుళ్ళవంక డైవర్ట్ అయివుంది.

మరికొంచెం సేపటికి భవనం బయట సమీపించింది, బయట సెంట్రీస్ కాపలా వున్నారు. సమావేశం అక్కడే జరుగుతుందని నిర్థారణ అయింది. ఎయిర్ కండిషన్డ్ చేయబడింది భవంతి అంతా. తమ చప్పుళ్ళు వారికి విన్పించే అవకాశం లేదు. ఎదురు పడ్డవాణ్ని ఎదురు పడ్డట్టే కాల్చేశారు యిద్దరూ.

హాలు ఎంట్రన్స్ వద్దకు చేరుకొని లోపలికి దారి తీశారు. అక్కడ ఎదురయిన సేవకులు ఆహుతయి పోయారు.

సమావేశం జరుగుతున్న హాలు పైనవుంది. బయట బెల్ వుంది. దాన్ని నొక్కాడు విశ్వనాథ్.

రెండు నిమిషాల తరువాత తలుపు తెరుచుకుంది కొద్దిగా.

"అర్జెంట్ మెస్సేజ్!" అంటూ లోనికి ప్రవేశించాడు విశ్వనాథ్ అతని వెనకే ప్రకాష్ కూడా. లోపల వాళ్ళ ఎదురు చూస్తున్న వ్యక్తి-జనరల్ కూడా వున్నాడు.

అప్పటికి రాత్రి ఒంటిగంట దాటి పదినిముషాలయింది.

9

కమాండర్ లీషాంగ్ వెంట నడుస్తున్న షీలా, అతను వైర్‌లెస్ ఆఫీస్‌వైపు కాక మరో దిక్కుకు దారి తీయడంతో అతడు తనెవరో కనిపెట్టాడా అన్న సందేహానికి లోనయింది. అయినా తన అనుమానాన్ని బయట ప్రదర్శించకుండా అతన్ని అనుసరించింది.

ఒక భవంతి ముందుకు వచ్చాడు. బయట నున్న సెంట్రీలు లీషాంగ్‌ని చూసి సెల్యూట్ చేశారు. లీషాంగ్, షీలాలు లోనికి నడిచారు.

అది లీషాంగ్‌కై కేటాయించిన భవనం. అన్ని ఆధునిక హంగులతో, సదుపాయాలతో అట్టహాసంగా వుంది.

షీలాని హాల్లో సోఫాలో కూర్చోపెట్టి, షీలాకి ఎదురుగా తను కూర్చొని అన్నాడు:

"ఇప్పుడు చెప్పు! మీ తమ్ముడి పేరేమిటన్నావ్? ఎలా ఉంటాడు?"

అంతకుముందు అతనితో వర్ణించిన వర్ణనను మరలా వల్లించింది.

రెండు క్షణాలామె ముఖంలోకి చూశాడు లీషాంగ్. ఇబ్బందిగా చూసింది షీలా.

"షీలా! నిన్ను నేను మనస్ఫూర్తిగా ప్రేమించాను. మీ ఇండియన్స్‌కి సెంటిమెంట్స్ ఎక్కువట. నిజం చెప్పు. నువ్వు ఇండియన్ ఏజంటువి కదూ?"

తాపీగా ఒక్కొక్క పదమే స్పష్టంగా అన్నాడు లీషాంగ్.

తలమీద పిడుగులు పడలేదు షీలాకి. కొద్దిగా కలవర పడింది. అతను తనని గ్రహించాడని తనకు ముందే తెలుసు. అయినా ఇలా బయటపడతాడనుకోలేదు.

"నేనా?" అంది తెల్లబోతూ, అమాయకంగా ముఖం పెట్టి.

"ఆల్ రైట్! నువ్వు సమర్థురాలైన ఏజంటువి. ఇక్కడి కెలా ప్రవేశించగలిగావో నాకర్థం గావటంలేదుగాని, ఇక్కడ స్థావరం సంపాదించడంలోనే నీ తెలివితేటలు బయటపడుతున్నాయి. నీ దేశంమీద నీ కెంత ప్రేమ ఉందో, నాకూ నా దేశంమీద అంతే ప్రేమ ఉంది. నీ ప్రాణాలు తీసయినా నీ చేత నిజం పలికిస్తాను."

షీలా లేచి నిలబడపోయింది. కాని లీషాంగ్ ఆమె భుజాలమీద చేతులు ఉంచి బలవంతంగా కూర్చోపెట్టాడు.

"నీ గురించి అధికారులకిగాని, కనీసం బయట ఉన్న సెంట్రీలకుగాని చెబితే కుక్కను కాల్చినట్లు కాల్చేస్తారు. కాని నిన్ను ప్రేమించిన నేరానికి నువ్వు వేశ్యవయినా నిన్ను అభిమానించినందుకు ఆ పాపం నేనే చేస్తాను. నీకు తెలిసిన రహస్యాలు చెప్పు. మన కోటలోకి ఎవరో ప్రవేశించారు గదూ? నా ఊహ నిజమైతే యిదివరకు జీప్ ప్రమాదంలో మరణించారనుకుంటున్న ఏజంట్లే అయి ఉంటారు. అవునా?"

కమాండర్ లీషాంగ్ ముఖం భయంకరంగా తయా రయింది. ఆమె గొంతు అతని చేతుల మధ్య నొక్కబడి పోతూంది. ఊపిరందక గిలగిల్లాడిపోతూంది షీలా. వది

లించుకోవటానికి విపరీతమయిన ప్రయత్నం చేస్తూందామె.

సరిగ్గా అదే క్షణంలో బయట బాంబులు పేలిన శబ్దం విన్పించింది. కలకలం. చటుక్కున ఆమెని వదిలి నిలుచున్నాడు కమాండర్ లీషాంగ్. గుమ్మంవైపు అడుగులేయబోయాడు. అదే అతను చేసిన పెద్ద పొరపాటు. అది తన జీవితాన్నే మార్చేస్తుందని తెలిసుంటే ఆ పొరపాటు చేసేవాడు కాదేమో?

షీలా చటుక్కున గౌన్ గుండా తొడల దగ్గరికి చేతిని పోనిచ్చింది. లోపల టేప్‌తో అతికించబడిన మినీ పిస్టల్‌ను బయటికి లాగి లీషాంగ్‌ని గురిచూసి కాల్చేసింది టపటప.

వీపులో దూరాయి గుళ్ళు. దబ్బున క్రింద పడిపోయాడు కమాండర్.

బయటకు పరుగెత్తింది షీలా. పిస్టలు శబ్దానికి లోపలికి రాబోతున్న సెంట్రీలు కూడా ఆమె పిస్టల్ గుళ్ళకు ఆహుతయిపోయారు. ఒకడి దగ్గర మెషిన్‌గన్ లాక్కుని బయటపడింది.

అప్పటికే వీధుల్లోని సైనికులు పేలిపోతున్న భవనం వైపు పరుగెడుతున్నారు. కమాండర్-ఇన్-చీఫ్ భవంతి వైపు దారితీసింది షీలా.

ఆ సమయంలోనే లోపల ఉన్న అధికారులనందరిని బెదిరించి వారి ఆయుధాలు లాక్కున్నాడు బ్రిగేడియర్ విశ్వనాథ్. ప్రకాష్ మెషిన్‌గన్‌తో అందరినీ కవర్ చేస్తున్నాడు.

అందరినీ కలిపి కట్టేసి "సారీ జనరల్స్!" అని జనరల్ రత్నరాజన్ వంక తిరిగాడు. ఆయనను ఎటువంటి హింసలూ

పెట్టలేదని తెలుస్తూనేవుంది.

విశ్వనాథ్, రత్నరాజన్‌లు బయటికి నడవగానే ప్రకాష్ హాలులో కొన్ని స్తంభాలకు బాంబులు అతికించాడు. మరో ఎలాస్టిక్ వైర్‌ను గుమ్మందాకా రానిచ్చి కొద్దిగా తెరిచివున్న తలుపుకు కనెక్ట్ చేశాడు. ఇప్పుడు తలుపు ఏమాత్రం కదిలినా చాలు ఎక్స్‌ప్లోజివ్స్ భయంకరంగా పేలుతాయి. పైనున్న జనరల్స్‌కి సంగతి తెలియదు.

బయటకు రాగానే ఎదురైంది షీలా. జరిగింది క్లుప్తంగా చెప్పింది. అప్పటికే కొంతమంది సైనికులు వీరిని గమనించారు. కాని ప్రకాష్, షీలాల చేతుల్లోని మెషిన్‌గన్స్ వారికి జవాబు చెప్పాయి.

నలుగురు కేబుల్ కార్ స్టేషన్ వైపు పరుగులు తీశారు. దార్లో అడ్డం వచ్చినవారిని వచ్చినట్లే కాల్చిపారేస్తున్నారు.

పది నిముషాల తరువాత స్టేషన్‌ను సమీపించారు. లోపల ఉన్న సిబ్బంది కూడా ఆహుతయిపోయారు గుళ్ళకి.

ప్రకాష్ ఇనుపతలుపులవద్దకు నడిచి బాంబులు అరేంజ్ చేశాడు తెరవగానే ప్రేలేట్లు.

విశ్వనాథ్ వెళ్ళి, ఇటునుంచి అటుకిగల టెలిఫోన్ వైర్లను తెంపి, రెండు స్టేషన్‌ల మధ్య సంబంధం లేకుండా చేశాడు.

ముగ్గురూ కేబుల్ కార్ ఎక్కగానే స్విచ్ ఆన్ చేసి, తానూ పరుగెత్తుకుంటూ పోయి ఎక్కాడు.

ఝుమ్మంటూ బయలుదేరింది కేబుల్ కార్.

ఆ సమయంలోనే దూరంగా భయంకరమయిన

విస్ఫోటం. పెద్ద పెద్ద జ్వాలలతో ఎగసిపడుతుందొక భవనం.

ఎవరో జనరల్, ఇతర అధికారులున్న భవనంను తలుపులు లాగివుండాలని భావించారు విశ్వనాథ్, ప్రకాష్‌లు.

కేబుల్ కార్ స్టేషన్‌ను సమీపించటంతో గబగబ పైకి ఎక్కాడు విశ్వనాథ్. షెడింగ్‌ని సమీపించగానే ఉలి సహాయంతో పైకెగిరాడు.

అదృష్టవశాత్తు ఏ దుర్ఘటనా జరగకుండానే పైకి చేరుకున్నాడు. కేబుల్ కార్ లోపలికి వెళ్ళిపోయింది.

అవతల అంత హడావుడి జరుగుతున్నా యిక్కడ ఎటువంటి అలికిడీ లేకపోవటం వారిలో అనుమానాన్ని కల్గించింది. బయట రోడ్ మీద ఎవరూ లేరు.

ఎదురవ్వబోయే ఆపద గురించి ఆలోచిస్తున్నారు విశ్వనాథ్, ప్రకాష్.

స్టేషన్ బయటికి అయిదడుగులు కూడా వేయకముందే ఎదురయింది ఆపద.

మూడువైపులనుంచి ధన్ ధన్‌మంటూ మరతుపాకులు గర్జించాయి. చటుక్కున బోర్లాగా పడిపోయారు నల్గురు.
ప్రకాష్ జేబులోనుంచి హేండ్ గ్రనేడ్ తీసి విశ్వనాథ్ కిచ్చాడు. ఇద్దరూ హేండ్ గ్రనేడ్స్‌ను అటూ ఇటూ విసిరేస్తున్నారు.

భయంకరమైన శబ్దంతో ప్రేలుతున్నాయి. సైనికుల ఆర్తనాదాలు విన్పిస్తున్నాయి. తుపాకుల గర్జనలతో మారుమ్రోగిపోతోంది ఆ ప్రాంతం అంతా.

అటు ఇటునుంచి మిలిటరీ ట్రక్స్ దూసుకొచ్చాయి మీదకు. కాని మరుక్షణంలోనే అవి దగ్ధమయ్యాయి.

ఈ హడావుడిలో నలుగురూ ఎదురుగానున్న భవనం లోకి జారుకోవటం ఎవరూ గమనించలేదు.

ఎదురువచ్చినవారిని అలానే మెషిన్‌గన్‌లతో కాలుస్తూ ఒక గదిలోకి దూరారు. తమ వెంట తెచ్చిన నైలాన్ తాడుని క్రిందికి జారవిడిచి, దానిని దూలానికి కట్టి క్రిందికి జారారు. ఆ గది తలుపులకు కూడా బాంబులు అమర్చాడు ప్రకాష్.

ఆ సందు నిర్జనంగా ఉంది. కొంతదూరం పరుగెత్తేసరికి ఎదురుగా ఒక జీప్ అడ్డువచ్చింది.

ఆపమన్నట్లు సైగ చేశాడు విశ్వనాథ్.

జరిగిన విషయం ఇంకా సరిగ్గా తెలియని ఆ జీపు డ్రైవర్ జీప్‌ని ఆపాడు. అతని గుండెల్లో దిగబడిందొక బాకు. వెనక ఉన్న అధికారులిద్దరూ ప్రకాష్, రత్నరాజన్ చేతుల్లో ఆహుతి అయ్యారు.

నలుగురూ జీప్ ఎక్కి బయలుదేరారు.

ఆక్సిలేటర్‌ని బాగా అదిమి పోనిస్తున్నాడు విశ్వనాథ్.

సింహద్వారం దాటి గాలితో పందెం వేస్తున్నట్లు పరుగెత్తుతోంది జీప్. టైర్లు రోడ్‌కి రాచుకొని గీపెడుతున్నాయి. టర్నింగ్స్ వచ్చినపుడు ఒక మూలకి ఒరిగి, మరీ ప్రయాణిస్తోంది జీపు. లోపల షీలా, రత్నరాజన్‌లు అంతటి రాష్ డ్రైవింగ్ ఎరిగినవాళ్ళు కాదేమో అదిరి పోతున్నారు.

10

"ఎవరో వస్తున్నారు!" అన్నాడు కుమార్‌సాహ్ని తలుపు సందుల్లోనుంచి చూస్తూ. కెప్టెన్ డిసౌజా, చంద్రకాంత్‌లు చటుక్కున లేచి నిలబడి గన్‌లు అందుకున్నారు.

"బ్రిగేడియర్ విశ్వనాథ్, జనరల్‌ని రక్షించి తీసుకొస్తున్నట్లున్నారు!" అన్నాడు మరలా.

"ఎంతమంది?"

"నలుగురు. విశ్వనాథ్. మేజర్ ప్రకాష్, జనరల్. మరి నాలుగో వ్యక్తి ఎవరు?"

"షీలా అయివుంటుంది!"

చైనా సైనికుల్ని బురిడీకొట్టించి తిరిగి వచ్చిన విశ్వనాథ్ బృందాన్ని క్షేమంగా చూడగానే ఊపిరి పీల్చుకున్నారు డిసౌజా బృందం.

"బస్ బాగయిందా?" అని ఆత్రంగా అడిగాడు విశ్వనాథ్ వచ్చీరావటంతోనే. అలా కాకపోతే మిషన్ అంతా చెడిపోతుంది. సరియైన వేళకు ఎయిర్‌పోర్ట్ చేరుకోవడం కష్టం. అదీగాక ఈపాటికి ట్రక్కులు అన్ని దిశల్లోనూ బయలుదేరే ఉంటాయి.

కెప్టెన్ డిసౌజా బాగయిందని జవాబివ్వటంతో గుండెల్లోంచి భారం తీసేసినట్లయింది.

జీప్‌ను విడిచిపెట్టి మరో నిమిషానంతరం బస్ బైలుదేరింది. డిసౌజా దగ్గరుంచిన ఎక్స్‌ప్లోజివ్స్‌ని తీసుకున్నాడు ప్రకాష్. ఎవరూ ఏమీ మాట్లాడుకోవటంలేదు.

భుజం నొప్పిగా ఉన్నప్పటికీ విశ్వనాథే డ్రైవింగ్ తీసుకున్నాడు. ఎవరెవరు ఏం చేయాలో చెప్పాడు అంతకుముందే.

షెడ్‌నుంచి బయటపడి రన్‌-వే దిశగా దూసుకుపోసాగింది.

అయితే రెండు ఫర్లాంగులు కూడా రాకముందే, చైనీస్ సైనికుల కంట పడనేపడ్డారు.

మొత్తం హిమాలయాలనే గాలించ నారంభించినట్లు న్నారు వారు. క్షణాల్లో విశ్వనాథ్ బస్ జాడ తెలిపాయి మిగిలిన జట్లుకి.

మూడు మిలటరీ ట్రక్కులు, మరో జీపు వారివెంట పడనారంభించాయి. ధనుస్సు నుంచి వెలువడిన బాణంలా దూసుకుపోతుంది బస్. ఇంజన్ మంచి కండిషన్‌లో ఉందో ఏమోగాని గాలిలా దూసుకుపోతూంది.

స్నోఫాల్ మరలా ఎక్కువయింది.

బస్సు వెనక అంతేవేగంతో వస్తున్నాయి ట్రక్కులు, జీపు. వాటిలోనుంచి మెషిన్ గన్ కాల్పులు ఆరంభం అయ్యాయి.

షీలా, రత్నరాజన్‌లు బస్సులో సీట్లమధ్య పడు కున్నారు. బస్సువెనక అద్దం చిల్లులు పడిపోయింది కాల్పు లతో. దానిని పూర్తిగా పడగొట్టి, కాల్పులు సాగించారు ప్రకాష్, డిసౌజాలు.

విపరీతమయిన స్పీడ్‌తో పోతున్నాయి. మెషిన్‌గన్ కాల్పులతో ఆ పర్వతప్రాంతం అంతా మారుమోగుతూ, దద్దరిల్లిపోతూంది.

అసలు నేలమీద నడుస్తుందా...అన్నట్లు నడుపు తున్నాడు విశ్వనాథ్.

విశ్వనాథ్ బృందం కూడా కాల్పులు సాగించడంతో వెనక వాళ్ళు కొంచెం తగ్గవలసి వచ్చింది. ఆ అవకాశం చాలు. మరింత తొక్కిపట్టాడు ఆక్సిలేటర్‌ని. మలుపులు కూడా ఎక్కువలేవు. వేగం కొంచెంమాత్రం తగ్గించి టర్న్ చేస్తున్నాడు.

నడుపుతూనే టైం చూసుకున్నాడు. ఉదయం అయిదు

న్నర గంటలు కావొస్తూంది. మరో ముప్పావుగంట టైంవుంది వారికి. సరిగ్గా ఆరింటికి వచ్చిన విమానం మరలా ఆరుంబావుకి గాల్లోకి ఎగురుతుంది. ఏమాత్రం ఆలస్యం అయినా తాము_తమంటత తాము నేపాల్ చేరు కొని అక్కడనుంచి బయటపడాల్సిందే.

దాదాపు అరవైమైళ్ళ స్పీడులో పోతూంది బస్. వెనక నుంచి గన్స్ చప్పుళ్ళు ఆగిపోయాయి. ఒక మలుపు తిరగ టంతో బస్ వేగాన్ని అందుకోలేకపోతున్నాయి వెనక ట్రక్కులు.

సుమారు రెండుమైళ్ళ దూరం వచ్చారు. మరో మైలుం టుంది. మరికొంత దూరం పోగానే ఎదురయిందొక చిన్న వంతెన.

దానిని చూడగానే చటుక్కున ఒక ఆలోచన వచ్చింది ప్రకాష్‌కి. విశ్వనాథ్ కూడా అతని ఐడియాని మెచ్చుకున్నాడు.

వంతెన దాటగానే ప్రకాష్, డిసౌజా క్రిందికి దూకారు ఆగిన బస్సులోనుంచి. ఇంజన్ మాత్రం ఆపలేదు విశ్వనాథ్.

ట్రక్కులు వారిని సమీపించాలంటే మరో నాలుగైదు నిమిషాలు పట్టవచ్చు. ఆ సమయం చాలు.

ఇద్దరూ క్రిందకి దూకి పరుగెత్తారు.

చిన్న వాగుమీద కట్టబడిన వంతెన అది. వాగులో నీళ్ళెక్కువలేవు. ఇద్దరూ స్తంభాలకు చకచక ఎక్స్ ప్లోజివ్స్ అంటించారు.

ప్రకాష్ ఎలాస్టిక్ వైర్‌తో వాటిని కలుపుతున్నాడు. సరిగ్గా ఆ క్షణంలోనే మలుపు తిరిగి ప్రత్యక్షమయ్యాయి మిలిటరీ ట్రక్కులు.

వెనక్కి పరుగెత్తారు ప్రకాష్, డిసౌజాలు.

ఎక్కీ ఎక్కగానే కదిలింది బస్. కన్నుమూసి తెరి చేంతలో ఎదురయిన మలుపు తిరిగి వెళ్ళిపోయింది.

ట్రక్కులు ఆగిపోయాయి. టైంబాంబ్స్ అరేంజ్ చేసి వుంటారు. రెండు నిమిషాలు గడిచినా ప్రేలలేదు. మరలా కదిలాయి ట్రక్కులు.

శబ్దం చేసుకుంటూ వంతెనని సమీపించింది మొదటి ట్రక్కు. వంతెన ఈ చివరకు చేరుకుంది. సరిగ్గా ఆ క్షణం లోనే టైర్ల క్రింద ఏదో వైర్ పడింది.

మరుక్షణమే భయంకరమయిన విస్ఫోటంతో ప్రేలి, సైనికుల శరీరాలతో పాటు, ట్రక్కు భాగాలు కూడా ఎగిరి క్రిందపడ్డాయి. వంతెన విరిగిపోయింది క్షణంలో.

జ్వాలల్లో మండిపోతున్న ట్రక్కుని చూసి వెనక వస్తున్న వాహనాలు రెండూ ఆగిపోయాయి.

విశ్వనాథ్ బృందం విమానాశ్రయాన్ని సమీపించింది.

రన్-వే చుట్టూ ఇనుప ముళ్ళతీగలతో చేసిన ఫెన్సింగ్ వుంది. ద్వారం మొదల్లోనే నాలుగయిదు భవనాలున్నాయి చాలా చిన్నవి. వారికి ముందు కొంచెం దూరంలో వరసగా నిలబెట్టబడి వున్నాయి పదివరకు మిగ్ విమానాలను పోలిన విమానాలు. వాటిమీద ఏ గుర్తులూ లేవు.

"గెట్ రెడీ!" అరిచాడు బ్రిగేడియర్ విశ్వనాథ్.

రివ్వున దూసుకుపోయి, గేట్లను ఛేదించుకుంటూ ఫెన్సింగ్ లోనికి ప్రవేశించింది బస్సు.

అక్కడ కాపలావున్న కొద్దిపాటి సిబ్బంది కాల్పులు సాగించారు. మెషిన్ గన్స్ లో అమ్మ్యూనిషన్ అయిపో వచ్చింది. బాంబులు కూడా అయిపోయాయి. ఉన్న కొద్ది

పాటి మందుగుండుతోనే వారిని ఎదుర్కొన్నారు.

వాతావరణం మరోసారి భయంకరంగా తయారయింది. ఆ ట్రావెలుళ్ళలోనూ బ్రిగేడియర్ విశ్వనాథ్ చెవులకు విమానశబ్దం సోకింది. చెవులు రిక్కించి విన్నాడు. సందేహం లేదు. తమ విమానమే.

తన వాళ్ళను హెచ్చరించి బస్ ను నిలిపి వున్న విమానాల వైపు తిప్పాడు. ఎమర్జన్సీ కొరకు ఎల్లప్పుడూ రెడీగా వుంటాయవి ఫ్యూయల్ తో.

ఆక్సిలేటర్ మరింతగా తొక్కాడు. టైర్లు ఊడిపోతాయేమోనన్నట్లుంది ఆ వేగం.

బస్ లో వున్నవారంతా విశ్వనాథ్ ప్రక్కకు చేరారు. బస్సుని విమానాల ప్రక్కగా పోనిచ్చి అన్నిటిమీద మినీ బాంబులు వేసి నాశనం చేశారు.

పెళ పెళ చప్పుడు చేస్తూ విమానాలన్నీ కాలిపోసాగాయి.

అదే సమయంలో రన్-వే మీద భారత విమానం దిగింది.

విశ్వనాథ్ బృందం సంతోషంగా అటు పరుగెత్తారు.

—: ఐపోయింది :—